


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 203, పేజీలు - 08
సోమవారం, జనవరి 5, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# సంక్రాంతి 'టికెట్' బాంబు

## - ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ షురూ

- పండుగ పూట సామాన్యుడిపై టికెట్ ధరల భారం
- జేబుకు భారీ కన్నం.. ఊరెళ్లాలంటే గుండె గుభేల్
- హైదరాబాద్ టు విజయవాడ టికెట్ రేటెంతో తెలుసా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సంక్రాంతి తెలుగువారికి అతిపెద్ద పండుగ. నగరాల్లో బతుకుదెరువు కోసం స్థిరపడిన లక్షలాది మంది ప్రజలు తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యే సమయం. అయితే ఈ పండుగ ఆనందం కంటే ప్రయాణ కష్టాలే ప్రయాణికులను ఎక్కువగా కలవరపెడుతున్నాయి. అప్పుడే టికెట్ల వేట మొదలు కాగా పరిస్థితి చూస్తుంటే సామాన్యుడికి సొంత ఊరు వెళ్లడం గగనంగా మారుతోంది. పండుగకు నెల రోజుల ముందే రైలు రిజర్వేషన్లు పూర్తయ్యాయి. స్లీపర్ నుంచి ఫస్ట్ క్లాస్ ఏసీ వరకు ఏ ట్రైన్ చూసినా 'రిగ్రెట్' అనే బోర్డే కనిపిస్తోంది. ఇక ఆఖరి నిమిషంలో తత్కాల్‌పై ఆశలు పెట్టుకుంటే అది కత్తి మీద సాములా మారింది. సరిగ్గా టికెట్లు బుక్ చేసే సమయానికి ఐఆర్సీటీసీ సర్వర్లు మొరాయించడం, పేమెంట్ ఫెయిల్ అవ్వడం సామాన్యమైపోయింది. మరోవైపు ఆర్టీసీ నడిపే ముందస్తు రిజర్వేషన్ బస్సులు కూడా ఇప్పటికే నిండిపోయాయి. అదనపు బస్సులు వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా పెరిగిన రద్దీకి అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వ రవాణా వ్యవస్థలు చేతులెత్తేయడంతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు పంజా విసురుతున్నాయి. డిమాండ్‌ను బట్టి టికెట్ ధరలను మూడు నుంచి నాలుగు రెట్లు పెంచేస్తున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుండి విజయవాడకు రూ. 700 ఉండే టికెట్ ధర ప్రస్తుతం రూ. 2,700

2లో..

## 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సన్నద్ధమవుతోంది

### - ప్రధాని మోదీ కీలక ప్రకటన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 2026 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారతదేశం పూర్తిగా సన్నద్ధమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించారు. గత పదకొండున్నర ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం దేశంలో క్రీడా రంగంలో సమూల మార్పులు చేసి, 20కి పైగా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్లను నిర్వహించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. భారత్ 'పూర్తి సన్నద్ధతతో' 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమవుతోందని ఆయన అన్నారు.

### 20కి పైగా అంతర్జాతీయ టోర్నమెంట్స్ నిర్వహించిన భారత్

వారణాసిలో నేడు ప్రారంభమైన 72వ సీనియర్ నేషనల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ప్రధాని మోదీ పాల్గన్నారు.

2లో..

## ఒక్క మాటకే అసెంబ్లీని బహిష్కరించడం ఏంటి.?

### - హరీశ్ రావుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సూర్యాపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయంపై హరీశ్ రావును లక్ష్యంగా చేసుకున్నారు. వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక మాట అన్నందుకే

2లో..

## కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా

- రాయలసీమ లిఫ్ట్ పనులను ఆపింది తానేనని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- రేవంత్ వ్యాఖ్యలతో చెలరేగిన దుమారం
- కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతానని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణానదీ జలాలపై శనివారం నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. తాను చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపించానని చెప్పుకొచ్చారు. అది తన చిత్తశుద్ధి అని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను ఇప్పటికే ఏపీ ప్రభుత్వం ఖండించింది. దీంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ పర్యటన ముగించుకుని చంద్రబాబు నాయుడు ఈరోజు హైదరాబాద్ చేరుకున్నారు.

2లో..

## నెరవేరిన ఉత్తరాంధ్ర వాసుల కల

### -భోగాపురం విమానాశ్రయంలో ఫస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్




అమరావతి (ప్రశ్న న్యూస్) ఉత్తరాంధ్ర వాసుల దశాబ్దాల కల నెరవేరింది. విజయనగరం జిల్లాలోని భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రయల్ రన్ సక్సెస్ అయింది. ఆదివారం తొలి విమానం రన్‌వేపై విజయవంతంగా ల్యాండింగ్ చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఢిల్లీ నుంచి వచ్చిన ఆ ప్రత్యేక విమానంలో ప్రయాణించారు. హుద్‌హుద్ వంటి పెద్ద తుపాన్లను సైతం తట్టుకునేలా ఎయిర్ పోర్ట్ ను నిర్మించారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీ అభివృద్ధిలో

2లో..

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని ఎన్నిసార్లు ఉరి తీయాలి.?

### - హామీల అమలుపై కేటీఆర్ ఫైర్

- కరువు నేలల్లో సిరులు పండించిన పరిపాలకుడు కేసీఆర్
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- చెక్ డ్యాములు పేల్చేసే చెత్త ప్రభుత్వమంటూ కాంగ్రెస్ పై ఫైర్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పిన మోసం చేసిన రేవంత్ రెడ్డిని, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన రాహుల్ గాంధీని ఎన్నిసార్లు ఉరి తీయాలి అని ప్రశ్నించారు. నదీ జలాల విషయంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిన ద్రోహాన్ని ఎండగడుతూ, వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల ఎకరాల భూములకు కొత్త సాగునీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని, నీళ్లు ఇవ్వకుండా లక్షల ఎకరాలు ఎండిపోయేలా చేస్తున్న కాంగ్రెస్ నేతలకు జలాల అంశం, ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

### -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

సభానాయకుడి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అధికార మదంతో విర్రవీగుతూ, తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కేసీఆర్ వంటి గొప్ప నాయకుడిని రాబందు అని విమర్శించడం ఆయన అల్పబుద్ధికి నిదర్శనమని విమర్శించారు. కరువు నేలల్లో జీవకళ తెచ్చిన కేసీఆర్ గురించి అనరాని మాటలు మాట్లాడితే తెలంగాణ ప్రజల హృదయాలు రగిలిపోతాయని హెచ్చరించారు.

### - కాంగ్రెస్ వైఫల్యాలు ఉరిశిక్షల ప్రస్తావన

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను

2లో..

## ఊరికి వెళ్లే ముందు చెప్పి వెళ్లండి

### - సీపీ సజ్జనార్ హెచ్చరికలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి వచ్చేసింది. నగరాల్లోని ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు అంతా తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు ప్రయాణమవుతున్నారు. అయితే పండుగ పూట ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని దొంగలు పంజా విసిరే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నగరవాసులను అప్రమత్తం చేశారు. ప్రజల భద్రత కోసం ట్విట్టర్ ఎక్స్ వేదికగా పలు కీలక సూచనలు జారీ చేశారు. కుటుంబంతో కలిసి కొన్ని రోజుల పాటు ఇల్లు విడిచి వెళ్తున్నట్లయితే ఆ విషయాన్ని మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో గానీ, బీట్ ఆఫీసర్‌కు గానీ తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఇలా చేయడం వల్ల పోలీసులు తమ రెగ్యులర్ పెట్రోలింగ్‌లో భాగంగా మీ ఇల్లు ఉన్న వీధిపై ప్రత్యేక నిఘా ఉంచుతారని ఆయన తెలిపారు. ఆధునిక పోలీసింగ్ అంటే కేవలం నేరం జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదని నేరం జరగకుండా ముందే నిరోధించడం కూడా అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ప్రయాణంలో ఉన్నప్పుడు ఇంట్లో భారీగా నగదును గానీ, బంగారు ఆభరణాలను గానీ ఉంచవద్దని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. 'మీ విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో లేదా ఇతర సురక్షితమైన ప్రదేశాలలో భద్రపరుచుకోండి. చిన్నపాటి అజాగ్రత్త దొంగలకు అవకాశంగా మారుతుంది' అని ఆయన సూచించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించేందుకు దొంగలు కిటికీలు, గుమ్మాల వద్ద నిఘా పెడతారని అందుకే విలువైన వస్తువులు ఇంట్లో లేకపోవడమే ఉత్తమమని ఆయన స్పష్టం చేశారు. నేటి కాలంలో సీసీటీవీ కెమెరాలు

2లో..

## పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం

### - సుప్రీంలో వాదనలకు తెలంగాణ సర్కారు సిద్ధం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గోదావరి నదీ జలాల్లో తమకు దక్కాల్సిన వాటా విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులను తాము అంగీకరించలేది లేదంటూ, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైలో సీనియర్ న్యాయ నిపుణులతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును వ్యతిరేకించేందుకు న్యాయపరమైన చర్యలను తెలంగాణ ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో భేటీ అయ్యారు.

2లో..

## ఎర్రకోట పేలుడు కేసు దర్యాప్తులో కీలక పురోగతి

### - కేసులో ఆసక్తికర అంశాలు వెల్లడి

- ఘోస్ట్ సిమ్‌లు వాడి పాక్ హ్యాండ్లర్లతో మాట్లాడిన నిందితులు
- గుర్తుపట్టకుండా ఉండేందుకు 'డ్యూయల్ ఫోన్' విధానం
- ఉగ్రకుట్రతో వాట్సాప్, టెలిగ్రామ్ నిబంధనలు మార్చిన కేంద్రం

2లో..



## మా పునాది వల్లే ఈ మైలురాయి

### - భోగాపురం ఎయిర్ పోర్టుపై జగన్ ట్వీట్



అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అవ్వడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయి అని, విజన్ వైజాగ్ లక్ష్య సాధన దిశగా పడిన కీలక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత దశకు చేరుకోవడానికి తమ ప్రభుత్వ హయాంలో వేసిన బలమైన పునాదే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ, "మా పాలనా

2లో..

# సంక్రాంతి 'టికెట్' బాంబు

నుండి రూ. 4 వేల వరకు పలుకుతోంది. విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఒక్కో సీటుకు రూ. 5 వేలకు పైనే వసూలు చేస్తున్నారు. నలుగురు సభ్యులున్న ఒక మధ్యతరగతి కుటుంబం ఊరెళ్లాలంటే కేవలం ప్రయాణానికే రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పండుగ కోసం దాచుకున్న సంపాదన అంతా ప్రయాణాలకే ధారపోయాల్సి వస్తోందని సామాన్యులు కన్నీరు పెడుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఇంత బహిరంగంగా దోపిడీకి పాల్పడుతున్నా రవాణా శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విమాన ప్రయాణ ఛార్జీలతో పోటీ పడుతున్న బస్సు రేట్లకు ఒక గరిష్ఠ పరిమితిని విధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రైవేట్ బస్సు ఛార్జీలపై ప్రభుత్వం తక్షణమే నియంత్రణ తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే శాఖ మరిన్ని జన్ సాధారణ లేదా ప్రత్యేక అన్‌రిజర్వ్‌డ్ రైళ్లను నడపాలని అంటున్నారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద రవాణా శాఖ ప్రత్యేక నిఘా బలందాలను ఏర్పాటు చేసి అధిక వసూళ్లకు పాల్పడే బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పండుగ అంటే కుటుంబంతో గడిపే సమయం కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అది కేవలం సంపన్నులకే సాధ్యమయ్యేలా కనిపిస్తోందని అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రయాణికులకు భరోసా ఇవ్వాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

# 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సన్నద్ధమవుతోంది

'గత దశాబ్దంలో ఫిఫా అండర్-17 ప్రపంచ కప్, హాకీ ప్రపంచ కప్ సహా 20కి పైగా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్లను దేశంలోని పలు నగరాల్లో నిర్వహించామని తెలిపారు. 2030 కామన్వెల్త్ క్రీడలు కూడా భారత్‌లోనే జరగనున్నాయి. భారత్ పూర్తి సన్నద్ధతతో 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని చూస్తోంది. ఎక్కువ మంది క్రీడాకారులకు ఆడేందుకు ఎక్కువ అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమని' చెప్పారు.

### క్రీడా రంగంలో సమూల మార్పులు

దేశం ప్రస్తుతం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' పై ప్రయాణిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి రంగం, అభివఅద్ధి నిర్వచనం ఈ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' తో ముడిపడి ఉందని, క్రీడలు కూడా అందులో ఒకటని అన్నారు. 'క్రీడా రంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టింది. నేషనల్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ యాక్ట్, ఖేలో ఇండియా పాలసీ 2025, వంటి నిబంధనల ద్వారా సరైన ప్రతిభకు అవకాశం లభిస్తుంది. తద్వారా క్రీడా రంగంలో పారదర్శకత పెరుగుతుంది. అలాగే దేశ యువత క్రీడలు, విద్య రెండింటిలోనూ ఒకేసారి ముందుకు సాగనున్నారు. ఒకవైపు మనం మెరుగైన మౌలిక సదుపాయాలు, నిధుల సమీకరణ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. దాంతో పాటు యువతకు అద్భుతమైన జీవితాన్ని క్రీడల ద్వారా అందించడానికి కూడా కృషి చేస్తున్నాం' అన్నారు.

### - క్రీడలపై ప్రభుత్వం, సమాజంలో చిన్న చూపు ఉండేది

ఒకప్పుడు క్రీడల పట్ల ప్రభుత్వం, సమాజంలో సైతం ఉదాసీనత ఉండేదని మోదీ అన్నారు. చాలా తక్కువ మంది యువకులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేవారు. గత దశాబ్దంలో క్రీడల పట్ల ప్రభుత్వం, సమాజం ఆలోచనలలో మార్పు కనిపిస్తోందని మోదీ అన్నారు. క్రీడా రంగంలో తన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, 'మేం స్కూల్ స్థాయిలో కూడా క్రీడాకారులకు ఒలింపిక్ అనుభవాన్ని అందించడానికి కృషి చేస్తున్నాం. ఖేలో ఇండియా ప్రచారం వల్ల వందలాది మంది యువకులకు జాతీయ స్థాయిలో ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. కొద్ది రోజుల కిందట ఎంపీ క్రీడా మహోత్సవం జరిగింది. ఇందులో కూడా దాదాపు కోటి మంది యువకులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎంపీ క్రీడా మహోత్సవం సందర్భంగా కాశీకి చెందిన దాదాపు 3 లక్షల మంది యువకులు మైదానంలో సత్తా చాటారు.వారణాసిలో వివిధ క్రీడలకు సంబంధించిన స్టేడియాలు నిర్మిస్తున్నాం. కొత్త క్రీడా సముదాయంలో చుట్టుపక్కల జిల్లాల క్రీడాకారులకు కూడా శిక్షణ పొందే అవకాశం లభిస్తోంది. మెగా టోర్నీలకు వారణాసి సిద్ధమవుతుండటంతో నాకు సంతోషంగా ఉంది. వాలీబాల్ జాతీయ పోటీల ద్వారా దేశ క్రీడల్లో నగరం స్థానం సంపాదించుకుంటుందని' ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఒక్క మాటకే అసెంబ్లీని బహిష్కరించడం ఏంటి.?

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తారా అని కవిత ప్రశ్నించారు. "ఆ అంశంపై వాకౌట్ చేసి, మళ్లీ సభకు రావొచ్చు కదా? బీఆర్ఎస్‌లో హరీశ్ ఓ గ్రూపును తయారు చేస్తున్నారు. బయట సభలు పెడుతూ చట్టసభల్లో మాట్లాడే అవకాశాన్ని వదులుకోవడం సరైంది కాదు" అని ఆమె వ్యాఖ్యానించారు. హరీశ్ ధనదాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ప్రాజెక్టును మార్చారని, ఆయన నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత విమర్శలు చేశారు. ప్రతిపక్షం లేని సభలో కృష్ణా జలాలపై ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. గత ప్రభుత్వాన్ని నిందించడంపై ఉన్న శ్రద్ధ, కృష్ణా నీటి వాటాలపై చర్చ జరపడంలో లేదని విమర్శించారు. తెలంగాణకు చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక చేపడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదాను రద్దు చేయాలని, ఆల్మట్టి డ్యాం ఎత్తు తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా నీటి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె ప్రశ్నించారు.

# కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా

ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని పిన్నమనేని సాయిబాబా నివాసానికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, టీడీపీ కార్యకర్త అయిన సాయిబాబా ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సాయిబాబా కుటుంబాన్ని పరామర్శించిన చంద్రబాబు నాయుడు, పిన్నమనేని సాయిబాబా మఅతి బాధాకరమని అన్నారు. సాయిబాబా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చివరి శ్వాస వరకు పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి సాయిబాబా అని అన్నారు. ఎన్టీఆర్ అభిమానిగా వచ్చి పార్టీ కోసం ఎనలేని సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. అయితే సాయిబాబా ఇంటికి చంద్రబాబు రావడంతో అక్కడికి మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. అక్కడి నుంచి చంద్రబాబు వెళ్లిపోతున్న సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదంపై చంద్రబాబు స్పందన తెలుపాల్సిందిగా మీడియా ప్రతినిధులు అడిగారు. దీనిపై స్పందించిన చంద్రబాబు త్వరలోనే అన్ని విషయాలు మాట్లాడతామని చెప్పారు.

### - రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఏపీ సర్కార్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమని పేర్కొంది. చంద్రబాబు కేంద్రంగా తెలంగాణలో అధికార, విపక్షాలు రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. ఏపీ నీటి హక్కులు, సీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ ఉండబోదని తెలిపింది. జగన్ హయాంలో అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు చేపట్టారని, రాయలసీమకు రోజుకు 3 టీఎంసీలంటూ ప్రకటనలతో జగన్ ప్రభుత్వం పనులు చేపట్టిందని తెలిపింది. జగన్ ప్రచారంతో లిఫ్ట్ పనులపై తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసులు వేసిందని, అలాగే కేంద్రం, ఎన్‌జీటీతో పాటు పలుచోట్ల ఫిర్యాదు చేసిందని పేర్కొంది. ఈ క్రమంలోనే అనుమతులు లేనందున పనులు నిలిపివేయాలని 2020లోనే ఎన్‌జీటీ, కేంద్రం ఆదేశాలు ఇచ్చిందని తెలిపింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆ పనులు నిలిచిపోయాయని పేర్కొంది.

# మా పునాది వల్లే ఈ మైలురాయి

కాలంలో ఈ ప్రాజెక్టుకు వేగవంతమైన అనుమతులు సాధించాం. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కోసం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ప్రాజెక్టుకు పటిష్ఠమైన పునాది వేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. ఆ రోజు మేం చేసిన కృషే ఇవాళ్టి ఈ కీలక మైలురాయిని చేరుకోవడానికి ముఖ్య కారణం" అని వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన జీఎంఆర్ గ్రూప్‌కు జగన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అదేవిధంగా, విశాఖపట్నం పోర్టును భోగాపురం విమానాశ్రయంతో అనుసంధానించే బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు 2023 మార్చిలో ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# నెరవేరిన ఉత్తరాంధ్ర వాసుల కల

గేమ్ ఛేంజర్‌గా మారనుంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఎయిర్ ఇండియా విమానం ఉదయం 11 గంటలకు ల్యాండ్ అయింది. చివరి ట్రయల్ రన్ సక్సెస్ అయిన తర్వాత, మే నెల నుంచే ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనుంది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, విశాఖపట్నం దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. విమాన సర్వీసులు, అంతర్జాతీయ కనెక్టివిటీ రావడం, వేలాది ఉద్యోగాలతో ఉత్తరాంధ్ర దశ మారనుంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట రెడీ అయిన భోగాపురం విమానాశ్రయం ఇప్పుడు ఒక నార్మల్ ఎయిర్ పోర్ట్ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చడానికి అవకాశం కలుగుతుంది.

### -తొలి ఏడాది 60 లక్షల మంది ప్రయాణీకులు

ఫేస్ రికగ్నిషన్ ద్వారా పేపర్ లెస్ ఎంట్రీ ఉండనుంది. 10 కంటే ఎక్కువ ఆధునిక ఏరోబ్రిడ్జిల ద్వారా నేరుగా విమాన ప్రవేశం ఉంటుంది. గంటకు 2,500 మంది ప్రయాణికులను నిర్వహించగల సామర్థ్యంతో సోలార్ పవర్, వర్షపు నీటి రీసైక్లింగ్ ద్వారాల లీడ్ గోల్డెన్ రేటింగ్ లక్ష్యంగా నిర్మాణం చేస్తున్నారు. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా టెర్మినల్ పూర్తవుతుంది. భవిష్యత్తులో దీనిని 1.8 కోట్ల వరకు పెంచనున్నారు. డిసెంబర్ 2025 నాటికి 91.7 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. 2026 జూన్ లోనే అల్లూరి పేరుతో భోగాపురం ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తుంది.

### -టెక్నీషియన్ నుంచి పైలట్‌వరకు ఏవియేషన్ హబ్

కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఈ ప్రాజెక్టును తన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు 4,592 కోట్లు తొలి దశలో ఖర్చు, భోగాపురం సమీపంలో 136 ఎకరాల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. విమానయాన రంగంలో వేలాది మందికి శిక్షణ, ఉపాధిని అందిస్తుంది. విమానాశ్రయం సిటీ నుండి 45 కి.మీ దూరంలో విశాఖ ఉన్నప్పటికీ, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం 3 ప్రధాన మార్గాలను సిద్ధం చేస్తోంది. 6 లేన్ నేషనల్ హైవేను ఎన్‌హెచ్ 16 నుండి నేరుగా ఎయిర్‌పోర్ట్‌కు అప్రోచ్ రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. విశాఖ పోర్టు నుండి భీమిలి మీదుగా భోగాపురం వరకు సముద్ర తీరం వెంట బీచ్ రోడ్డును బీచ్ కారిడార్ గా అభివృద్ధి చేస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ఫార్మా, మెరైన్, టెక్స్‌టైల్ ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు భారీ కార్గో టెర్మినల్ సిద్ధం చేస్తున్నారు. అంతర్జాతీయ విమానాలు సైతం ఇక్కడికి వస్తాయి.

### - మరిన్ని నగరాలతో అనుసంధానం

భోగాపురం ఎయిర్ పోర్ట్ వలన దుబాయ్ & అబుదాబి వంటి గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఈ రూట్లకు ప్రాధాన్యత ఉంటుంది. సింగపూర్, మలేషియా తదితర ఆగ్నేయాసియా దేశాలకు వ్యాపార, పర్యాటక రంగాల్లో అభివృద్ధి అవుతుంది. రన్‌వే పొడవు ఎక్కువగా ఉండటంతో భవిష్యత్తులో యూరోప్, అమెరికా దేశాలకు కూడా కనెక్టింగ్ విమానాలు లేదా నేరుగా విమానాలు నడిపేందుకు వీలవుతుంది. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాలకు విమానాల ఫ్రీక్వెన్సీ పెరుగుతుంది.

# రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని ఎన్నిసార్లు ఉరి తీయాలి.?

ఉరి తీయాలని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటుగా సమాధానమిచ్చారు. మాట తప్పినందుకు ఉరి తీయాల్సి వస్తే, అశోక్ నగర్ అడ్డా మీద 2 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించినందుకు రాహుల్ గాంధీని, రుణమాఫీ పేరుతో రైతులను వంచించినందుకు కాంగ్రెస్ నాయకత్వాన్ని, బీసీ రిజర్వేషన్లపై అబద్ధాలు చెప్పినందుకు రేవంత్ రెడ్డిని ప్రజలు ఎక్కడ ఉరి తీయాలో ఆలోచించుకోవాలి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### - ప్రాజెక్టులపై రేవంత్ అజ్ఞానం అంటూ విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇరిగేషన్ పట్ల కనీస అవగాహన లేదని కేటీఆర్ విమర్శించారు. బేసిన్లకు, ఐఐటీలకు, ట్రిబ్యునళ్లకు మధ్య ఉన్న తేడాలు కూడా తెలియని వ్యక్తి జలాల గురించి చర్చించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమైక్యవాదుల సంచులు మోసిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, అటువంటి అల్పుడి చేతిలో తెలంగాణ విలవిలలాడుతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణకు అత్యంత ద్రోహం జరిగిందని, దానికి కాంగ్రెస్ పార్టీయే పరిపూర్ణ బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### - అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చెప్పినవి అబద్ధాలే.. ఏపీ ప్రభుత్వం క్లారిటీ

రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్) పనులు తన ఒత్తిడి వల్లే ఆగిపోయాయన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం రాజకీయ లబ్ధి కోసం చేసిన అసంబద్ధ వ్యాఖ్యలని, తెలంగాణ సీఎం మాటల్లో నిజం లేదంటూ కొట్టిపారేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టడం వల్లే 2020లో ఎన్‌జీటీ, కేంద్రం ఈ ప్రాజెక్టును నిలిపివేశాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024లో కూటమి ప్రభుత్వం రాకముందే కేంద్రం ఆ పనులను నిలిపివేసిందని, ఇందులో రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేదని ఏపీ సర్కార్ వివరించింది. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, వాస్తవాలను వక్రీకరించవద్దని ఏపీ ప్రభుత్వం హితవు పలికింది.

# ఊరికి వెళ్లే ముందు చెప్పి వెళ్లండి

భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీలైతే మీ ఇళ్లకు నిఘా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, స్మార్ట్‌ఫోన్ ద్వారా వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే, ఇంటి బయట లైట్లు రాత్రంతా వెలిగేలా చూసుకోవడం వల్ల కూడా దొంగతనాలను అరికట్టవచ్చునని చెబుతున్నారు. ఇరుగుపొరుగు వారితో మాట్లాడి, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇచ్చేలా సమన్వయం చేసుకోవాలని కోరారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా లేదా మీ కాలనీలో అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే 'డయల్ 100' కు కాల్ చేయాలని కోరారు. పండుగ ఆనందం ఆవిరి కాకుండా ఉండాలంటే ఈ చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని ఆయన గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం మీ భద్రత కోసం శ్రమిస్తున్నారని, నిశ్చింతగా పండుగ జరుపుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం

కోర్టులో రాష్ట్రం తరపున సమర్థవంతమైన, బలమైన వాదనలు వినిపించాలని వారు న్యాయ నిపుణులను కోరారు. అవసరమైన అన్ని పత్రాలు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం కార్యాలయం అప్రమత్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా పోలవరం ప్రాజెక్టును బనకచర్ల లేదా నల్లమల సాగర్‌తో అనుసంధానించే విస్తరణ పనులను ఏపీ ప్రభుత్వం చేపడుతోందని పిటిషన్‌లో ఆరోపించింది. ఈ పనులను తక్షణమే ఆపాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని కోరింది. ఆమోదించిన అసలు డిజైన్ ప్రకారమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలని స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నల్లమల సాగర్ ప్రాజెక్టు నివేదికలను పరిశీలించడాన్ని కూడా పిటిషన్‌లో తప్పుబట్టింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేస్తోందని, ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, ఆర్థిక సహాయం నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ పిటిషన్ త్వరలో సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

### హెల్మెట్‌ను ఏఐ ట్రాఫిక్ పరికరంగా మార్చిన టెకీ.. ఉల్లంఘునులను గుర్తింపు

బెంగళూరు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తుల పట్ల ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విసిగిపోయాడు. తన హెల్మెట్‌ను ఏఐ ట్రాఫిక్ పోలీస్ పరికరంగా మార్చాడు. దీంతో ట్రాఫిక్ ఉల్లంఘులను గుర్తించి నేరుగా పోలీసులకు సమాచారం అందిస్తున్నాడు. (Helmet Into AI Traffic Device) కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. పంకజ్ తన్వర్ బెంగళూరులోని ఐటీ సంస్థలో పని చేస్తున్నాడు. రోడ్లపై నిత్యం ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారుల పట్ల అతడు విసిగిపోయాడు.కాగా, పంకజ్ తన నాలెడ్జ్‌తో హెల్మెట్‌ను ఏఐ ట్రాఫిక్ పోలీస్ పరికరంగా తీర్చిదిద్దాడు. ఆ హెల్మెట్ ధరించి బైక్‌పై వెళ్తున్నప్పుడు రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని సులువుగా గుర్తిస్తున్నాడు. ఈ వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో వాహనదారులు ఎలాంటి ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తున్నారో అన్నది పసిగడుతున్నాడు. ట్రాఫిక్ ఉల్లంఘన వివరాలు, ఆ వాహనం నంబర్, లొకేషన్ సమాచారాన్ని ట్రాఫిక్ పోలీసులకు చేరవేస్తున్నాడు.మరోవైపు తన హెల్మెట్‌ను ఏఐ ట్రాఫిక్ పోలీస్ హ్యాకింగ్ పరికరంగా మార్చిన విషయాన్ని పంకజ్ తన్వర్ ఎక్స్‌లో స్వయంగా పేర్కొన్నాడు. అది పనిచేసే విధానాన్ని రియల్‌గా చూపించి వివరించాడు. ఇప్పుడు వాహనదారులు సురక్షితంగా ఉండవచ్చని పేర్కొన్నాడు.కాగా, పంకజ్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు భిన్నంగా స్పందించారు.

# ఎర్రకోట పేలుడు కేసు దర్యాప్తులో కీలక పురోగతి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కీలక విషయాలు వెలుగులోకి తెచ్చింది. ఈ కేసులో అరెస్టయిన 'వైట్ కాలర్' ఉగ్రవాదులు, పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లతో మాట్లాడేందుకు 'ఘోస్ట్ సిమ్' కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను వాడినట్లు తేలింది. విచారణలో నిందితులైన వైద్యులు 'డ్యూయల్ ఫోన్' విధానాన్ని అనుసరించినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. ఒక ఫోన్‌ను తమ వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాలకు వాడుతూ, రెండో ఫోన్‌ను కేవలం ఉగ్ర కార్యకలాపాలకే పరిమితం చేశారు. ఈ 'టెర్రర్ ఫోన్'లో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని 'ఉకాసా', 'ఫైజాన్', 'హష్మీ' అనే కోడ్ నేమ్స్ ఉన్న హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపారు.నకిలీ లేదా ఇతరుల ఆధార్ వివరాలతో తీసుకున్న సిమ్‌లనే 'ఘోస్ట్ సిమ్'లుగా పిలుస్తున్నారు. ఈ సిమ్ కార్డు ఫోన్‌లో లేకపోయినా ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లు పనిచేసేలా ఈ టెక్నాలజీని వాడుకున్నారు. దీనివల్ల వీరిని ట్రేస్ చేయడం కష్టంగా మారింది. హ్యాండ్లర్ల నుంచి యూట్యూబ్ ద్వారా ఐఈడీల తయారీ నేర్చుకుని దేశంలో దాడులకు ప్లాన్ చేసినట్లు తేలింది. ఈ ఉగ్ర కుట్ర వెలుగులోకి రావడంతోనే కేంద్ర టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్) గతేడాది నవంబర్‌లో కీలక నిబంధనలు తీసుకొచ్చింది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి యాప్‌లు ఇకపై ఫిజికల్ సిమ్ కార్డు డివైజ్‌లో ఉంటేనే పనిచేసేలా చట్టం చేసింది. ఒకవేళ సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే ఆటోమేటిక్‌గా లాగౌట్ అయ్యేలా నిబంధనలు అమలులోకి వచ్చాయి. గతేడాది నవంబర్ 10న జరిగిన ఈ పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎన్‌ఐఏ విచారణను మరింత ముమ్మరం చేసింది.

# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత డబ్బు సృజన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సృజన్ రెడ్డి**

**- జన్మదిన వేడుకల్లో నేతల ప్రశంసలు**





బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డబ్బు సృజన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నేతలు,యువజన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలలో భాగంగా కేక్ కట్ చేయించి,మిఠాయిలు తినిపించి, సృజన్ రెడ్డి నిత్యం ప్రజా సేవలో నిత్యం నిమగ్నమవుతూ,బోయినిపల్లి మండల అభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, గ్రామ యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహితురాలిని హత్య చేసిన వ్యక్తి.. ఆ తర్వాత ఆత్మహత్య



బెంగళూరు: స్కూల్‌లో కలిసి చదువుకున్న వివాహితురాలైన స్నేహితురాలిని ఒక వ్యక్తి పెళ్లి కోసం బలవంతం చేశాడు. ఆమె అంగీకరించకపోవడంతో కత్తితొ పొడిచి హత్య చేశాడు. ఆ తర్వాత అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. (ఘుఅ వీబతీసవతీం ఔశీఝుఅ ఖీతీఱవవఅ, ౕాబఆఱఅవ) కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 30 ఏళ్ల రంజితకు 12 ఏళ్ల కిందట మహారాష్ట్రకు చెందిన సచిన్ కటేరాతో పెళ్లి జరిగింది. వారికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా, వ్యక్తిగత కారణాల వల్ల భర్త నుంచి రంజిత విడిపోయింది. కర్ణాటకలోని యల్లాపూర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సహాయకురాలిగా ఆమె పని చేస్తున్నది.మరోవైపు చిన్నప్పుడు స్కూల్‌లో కలిసి చదువుకున్న స్నేహితుడు రఫీక్ ఇమామ్సాబా తరచుగా రంజిత ఇంటికి వచ్చి భోజనం చేసేవాడు. వారిద్దరి మధ్య చనువు పెరిగింది. ఈ నేపథ్యంలో భర్తను వీడి ఒంటరిగా జీవిస్తున్న ఆమెను పెళ్లి చేసుకుంటానని అతడు ఒత్తిడి చేశాడు. రంజిత, ఆమె కుటుంబం దీనికి ఒప్పుకోలేదు.అయితే పెళ్లికి వ్యతిరేకించిన రంజిత పట్ల రఫీక్ కక్షగట్టాడు. జనవరి 3న స్కూల్ పని తర్వాత ఇంటికి తిరిగి వెళ్తున్న ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన రంజితను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆ తర్వాత అటవీ ప్రాంతంలోని చెట్టుకు ఉరివేసుకుని రఫీక్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నైజీరియాలో కాల్పులు.. 30 మందికి పైగా మృతి.. పలువురు కిడ్నాప్

ఇటీవల అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న నైజీరియాలో మరోసారి కాల్పుల మోత మోగింది. సాయుధులైన దుండగులు జరిపిన కాల్పుల్లో 30 మందికి పైగా ప్రజలు మరణించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పలువురిని కిడ్నాప్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజా ఘటన శనివారం సాయంత్రం జరిగింది.పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఉత్తర నైజీరియా, నైగర్ రాష్ట్రంలోని కసువాన్-డాజి అనే గ్రామంపై కొందరు ఆయుధాలతో దాడి చేశారు. గ్రామంలో కనిపించిన వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. స్థానిక మార్కెట్ ను తగలబెట్టడంతోపాటు, పలు ఇండ్లు, ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో 37 మందికిపైగా మరణించినట్లు పోలీసులు తెలిపారు. మరికొంతమందిని కిడ్నాప్ చేశారు. అయితే, మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుందని స్థానికులు తెలిపారు. బాధితులంతా పపిరి తెగకు చెందిన వారు. దుండగులు దాడి చేసినప్పటికీ.. ఇంకా తమకు సాయం, రక్షణ అందలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, బాధితుల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని స్థానిక పోలీసులు తెలిపారు. కిడ్నాప్ అయిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇటీవలి కాలంలో ఇదే ప్రాంతంలో 300 మందికిపైగా స్కూల్ విద్యార్థుల్ని, టీచర్లను దుండగులు కిడ్నాప్ చేశారు. కొంతకాలంగా ఇక్కడ క్రిస్టియన్లపై ముస్లిం సాయుధ సంస్థలు దాడులు చేస్తున్నాయి

## నూతన వ్యవసాయ విధానంతో రైతులకు లాభదాయకం : రమణ కుమార్



మరికల్, జనవరి 04 : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని, నూతన విధానంతో వ్యవసాయం చేయడం రైతులకు లాభదాయకమని కేంద్ర నోడల్ అధికారి రమణ కుమార్ సూచించారు. ఆదివారం మరికల్ మండల కేంద్రంలో వ్యవసాయ పొలాలను, ఎర్రచందనం పెంపును పరిశీలించారు. నారాయణపేట జిల్లాను ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం కింద మంజూరు చేయడంతో జిల్లాలో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం రైతులతో ఆయన మాట్లాడారు. పత్తి పంట సాగు క్రయ విక్రయాలకు రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ చైర్మన్‌తో ఫోన్లో మాట్లాడుతూ రైతుల ఇబ్బందుల గురించి వివరించారు. ఈ పథకం ద్వారా ఆరేళ్లకు రైతుల విత్తనాలు ఎరువుల కోసం సుమారుగా 1000 కోట్లు మంజూరు చేస్తారని తెలిపారు. ఉపాధి హామీ పథకంలోని కూలీలను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే విధంగా చూడాలని రైతులు కోరారు. మండల కేంద్రంలోని ఉచ్చల ప్రకాష్ పొలంలో నూతన పద్ధతిలో కూరగాయల పండించే పద్ధతిని పరిశీలించారు. దండు నారాయణరెడ్డి పొలంలో ఔషధాలకు ఉపయోగపడే ఎర్రచందనం, వివిధ రకాల చెట్లను పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా వ్యవసాయాలను చేస్తే అధిక లాభాలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ శంకర ప్రసాద్, శిక్షణ కలెక్టర్ హర్షిత్ చౌదరి, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి, తాసిల్దార్ రామకోటి, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## రైతుకు విసుగు తెప్పించిన మందుబాబులు.. ఫ్లెక్సీపై ఏం రాశాడో తెలుసా..?



నర్సాపూర్, జనవరి 4 : మందుబాబులు రోజు ఓ రైతు తోటలోకి వెళ్లి మద్యం సేవించి బీభత్సం సృష్టిస్తున్నారు. మందుబాబుల వికృత చేష్ఠలతో విసుగెత్తిపోయిన రైతుకు సరికొత్త ఆలోచన వచ్చింది. మందుబాబుల ఆగడాలను తట్టుకోలేక సదరు రైతు వినూత్న ఆలోచన చేశాడు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో ఆనంద్ అనే రైతు మామిడి తోటను సాగు చేస్తున్నాడు. ప్రధాన రహదారికి ఈ మామిడి తోట పక్కనే ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం మందుబాబులు తోటలోకి దూరి మద్యం సేవించి కాళీ సీసాలను పగలగొట్టి నానా బీభత్సం సృష్టిస్తున్నారు. రైతు ఆనంద్ మౌఖికంగా ఎన్ని సార్లు చెప్పినా మందుబాబులు వాళ్ళ పద్ధతిని మార్చుకోలేకపోయారు. ఇందుకు ఆ రైతుకు సహనం నశించి ఓ ప్లాన్ వేశాడు. ఫ్లెక్సీ లపై మామిడి తోటలో మద్యం తాగితే 25 చెప్పు దెబ్బలు.. అలాగే 5000 జరిమాన అంటూ రాయించి తోటముందు కట్టించాడు. ఈ ఫ్లెక్సీలను చూసైనా మందుబాబుల ప్రవర్తనలో మార్పు వస్తుందో.. లేదో..? చూడాలి. నిత్యం మందుబాబులు తోటలోకి వచ్చి మద్యం తాగి సీసాలను పారవేయడమే కాకుండా వాటిని పగలగొట్టి నానా విధ్వంసం సృష్టిస్తున్నారని సదరు రైతు ఆనంద్ వాపోయాడు.

## తాగుబోతు ఆటో డ్రైవర్ వీరంగం..

### చేతిలో పాముతో ట్రాఫిక్ పోలీసులపై బెదిరింపులు



హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో ఓ తాగుబోతు ఆటోడ్రైవర్ వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న అతని ఆటోను పోలీసులు సీజ్ చేయడంతో రెచ్చిపోయాడు. ఆటోలో నుంచి పామును తీసుకొచ్చి పోలీసులపై బెదిరింపులకు దిగాడు. పాతబస్తీ పరిధిలోని చాంద్రాయణగుట్ట చౌరస్తా వద్ద శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఆటో డ్రైవర్‌ను ఆపి పరీక్షంచగా రీడింగ్ 150 వచ్చింది. దీంతో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఆటోను సీజ్ చేశారు. అప్పుడు తన సామగ్రి ఉందంటూ ఆటో వద్దకు వెళ్లిన డ్రైవర్.. వెంటనే అందులో నుంచి ఒక పామును తీసుకొచ్చాడు. దాన్ని చేతికి చుట్టుకుని పోలీసులను బెదిరిస్తూ హల్‌చల్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు అదును చూసి అతన్ని పట్టుకునేలోపే.. పాముతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.

## బస్ భవన్ వద్ద మహాధర్నాకు ఐఎన్‌టీయూసీ పిలుపు

హైదరాబాద్ : యూనియన్లను పునరుద్ధరణ చేయాలని, 2021, 2025 వేతన సవరణలను అమలు చేసి, కార్మికుల విలీన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆర్టీసీ ఎస్ డబ్ల్యూఎఫ్ (ఐఎన్ టీయూసీ) బస్ భవన్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నెల 9న ధర్నా చేయాలని, అందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నేత కే రాజిరెడ్డి పిలుపునిచ్చారు. రిటైర్ అయిన వారికి అన్ని బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, పని భారాలు తగ్గించాలనే తదితర సమస్యల పరిష్కారానికి చేపట్టిన 'ఛలో బస్సు భవన్ మహాధర్నా' విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మెయిన్ రోడ్డుపై దుర్గంధం..

### మూడు రోజులైనా పట్టించుకునేవారే లేరా..?



అది నిత్యం వాహన రాకపోకలు సాగే మెయిన్ రోడ్. ఈ రహదారి వెంబడి ఓ కుక్క గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై కుక్క కళేబరం కంపు కొడుతున్నది. గత మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని కుక్క చనిపోయినప్పటికీ.. చనిపోయిన కుక్కను అక్కడినుండి తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్గందాన్ని వెదజల్లుతున్నది. అయితే ఇప్పటికీ గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల రోడ్డుపై నుండి వెళ్లే వాహనదారులకు ముక్కు పుటాలు అదిరేలా దుర్గంధం రావడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. కుక్క కళేబరాన్ని అక్కడినుండి తొలగించకపోవడంతో రోగాలు సోకే అవకాశం ఉందని పలువురు జనాలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది కుక్క కళేబరాన్ని తొలగించి వాహనదారులకు ఉపశమనం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

## మూగజీవాల నుంచి సీక్రెట్‌గా రక్తం సేకరిస్తున్న ముఠా




మేడ్చల్ జిల్లాలో పోలీసులు అర్థరాత్రి జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. మూగ జీవాల నుంచి రక్తం సేకరించి బయటకు తరలిస్తున్న ముఠాగుట్టు రట్టు చేశారు. కీసర పీఎస్ పరిధి సత్యనారాయణ కాలనీలో సీక్రెట్‌గా మూగ జీవాల నుంచి రక్తం సేకరిస్తున్నట్టు గుర్తించారు. నిర్వాహకులు మటన్ షాపులో రక్తం సేకరించి బయటకు తరలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మటన్ షాప్ యజమాని సోనూ, నకిలీ వెటర్నరీ డాక్టర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సుమారు 180 రక్తం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ వ్యాపారం వెనుకున్న నెట్‌వర్క్ కూపీ లాగుతున్నారు.

## ఆపరేషన్ స్మైల్‌తో అనాథ పిల్లలకు పునరావాసం

**- ఎస్పీ డీవీ శ్రీనివాస రావు**



మెదక్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోపాటు తప్పిపోయిన, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలను రక్షంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌ఉ12 కార్యక్రమంను విజయవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు . శనివారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో బాల కార్మికుల విముక్తి పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మాట్లాడుతూ, బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి రక్షంచడం, తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబ సభ్యులకు చేర్చడం, అనాథ పిల్లలకు పునరావాసం కల్పించడమే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలల ముఖాల్లో చిరునవ్వు చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి జనవరి 31 వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, ఆర్ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పుల ఒత్తిడి తట్టుకోలేక.. బిల్డర్ భార్య ఆత్మహత్య



అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ఓ బిల్డర్ భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో చోటుచేసుకుంది. సరూర్‌నగర్‌లో రియల్ ఎస్టేట్ బిల్డర్ భార్య బూరుగు అర్చన కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టింది. అయితే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడం తద్వారా అమ్మకాలు తగ్గడంతో అర్చన కుటుంబంలో ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. పెట్టుబడులతో అప్పులపాలై ఆ ఒత్తిడిని తట్టుకోలేక అర్చన బలవన్మరణానికి పాల్పడింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడంతో అప్పుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న బిల్డర్ భార్య సరూర్ నగర్‌లో కుటుంబం అప్పులపాలై, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న రియల్ ఎస్టేట్ బిల్డర్ భార్య బూరుగు అర్చన

## ఆక్రమణలపై సమాధానం ఇవ్వండి.. కోదాడలో నిరుపేదలకు నోటీసులు.. ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే బొల్లం..



కోదాడ : కోదాడ పెద్ద చెరువును ఆక్రమించుకున్నారని, వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పట్టణ పరిధిలోని సాయిబాబా థియేటర్ సమీపంలోగల వీధులలో రేకుల ఇల్లు, గుడిసెల వాసులు 372 మందికి రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. దాంతో బాధితులు కంటిమీద కునుకు లేకుండా భయంభయంగా ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆ ప్రాంతంలో పర్యటించారు. అధికారుల నుంచి నోటీసులు అందుకున్న బాధితులకు గుండె ధైర్యం చెప్పి ఓదార్చారు. నోటీసులు అందుకున్న 372 మందిలో 200 మంది కూలీనాలీ చేసుకుని బతికే నిరుపేదలు ఉండటం గమనార్హం. తాము 50 ఏళ్ల నుండి ఇక్కడే జీవిస్తున్నామని, 40 గజాల స్థలంలో ఇల్లు కట్టుకొని పొట్ట కూటి కోసం కూలీపనులు చేస్తూ బతుకుతుంటే ఈ మాయదారి నోటీసులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. వేల గజాల ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మా మీద ఈ జులుం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మమ్మల్ని చంపిన తర్వాతే మా ఇల్లు కూలగొట్టాలని మాజీ ఎమ్మెల్యే ముందు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, మీకు అండగా నేనుంటానని బాధితులకు భరోసా ఇచ్చారు. బాధితులు ఆక్రమణదారులైతే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నప్పుడు ఈ విషయం ఎందుకు గుర్తుకురాలేదని అసహనం వ్యక్తంచేశారు. కోర్టు నోటీసుల పేరుతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బాధితులను భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే అన్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులే బాధితుల పక్షన నోటీసులకు సమాధానం చెప్పాలన్నారు. ఓ పక్క కోదాడ మున్సిపాలిటీ పరిధిలో కొందరు అధికారులు లంచాలకు అలవాటుపడ్డారని, ప్రభుత్వ స్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకొని అపార్టుమెంట్లు కట్టుకున్న దురాక్రమణదారులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా నిరుపేదలను ఆక్రమణదారులు అనటం దారుణమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. మరొక్కసారి బాధితులను ఇబ్బంది పెడితే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. బాధితులకు అండగా ఉంటామని, మీ ఇళ్లకు నేనే భరోసా అని బాధితులకు గుండె ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మాజీ కౌన్సిలర్ చింతల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## విమాన ప్రయాణికులకు అలర్ట్..

### విమానంలో పవర్ బ్యాంక్ వాడకంపై కీలక సూచన



విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ డీజీసీఏ కీలక సూచనలు చేసింది. విమాన ప్రయాణికులు పవర్ బ్యాంక్, అదనపు బ్యాటరీలు వాడే విషయంలో తాజాగా కొన్ని నిబంధనల్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై విమాన ప్రయాణికులు హ్యాండ్ లగేజ్ లో మాత్రమే పవర్ బ్యాంక్, అడిషనల్ బ్యాటరీలు, ఇతర లిథియం బ్యాటరీ డివైజ్ లను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓవర్ హెడ్ కంపార్ట్ మెంట్, ఇతర కార్గో లగేజ్ లలో వీటిని తీసుకెళ్లడానికి అనుమతించరు. దీని ద్వారా విమానంలో ప్రయాణికులకు మరింత భద్రత కలగనుంది. ఇటీవల ఈ నిబంధనలకు సంబంధించి డీజీసీఏ 'డేంజరస్ గూడ్స్ అడ్వైజరీ సర్క్యులర్ణ జారీ చేసింది. సాధారణంగా లిథియం బ్యాటరీలు కొన్ని సార్లు వేడెక్కి పేలడం, వాటి ద్వారా నిప్పు రవ్వలు అంటుకుని మంటలు వ్యాపించడం వంటివి జరుగుతున్నాయి. అందులోనూ విమానం గాల్లో ఉండగా ఇలా బ్యాటరీలు పేలడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే విమాన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గాల్లో మంటల్ని నియంత్రించడం సాధ్యం కాదు. విమానాల్లోని ఓవర్ హెడ్ కంపార్టుమెంట్లు, కార్గోలు వంటి వాటిల్లో బ్యాటరీల ద్వారా అగ్నిప్రమాదాలను త్వరగా గుర్తించడం సాధ్యం కావట్లేదు. అందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. హ్యాండ్ లగేజ్ లో మాత్రమే ఇవి ఉంటే.. వీటి ద్వారా ఎప్పుడైనా అనుకోని ఘటనలు జరిగితే ముందుగానే గుర్తించి నియంత్రించే వీలుంది. ఇటీవల కొన్ని విమానాల్లో పవర్ బ్యాంకుల ద్వారా మొబైల్స్ ఛార్జింగ్ పెడుతున్నప్పుడు, ఎయిర్ క్రాఫ్ట్ సీట్ పవర్ ఔట్లెట్లలో చార్జింగ్ చేస్తున్నప్పుడు అవి పేలి కొన్ని అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న డీజీసీఏ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై విమాన ప్రయాణానికి ముందుగా ఈ విషయంలో జాగ్రత్తగా తనిఖీలు చేస్తారు. హ్యాండ్ లగేజీలలో మాత్రమే వీటని అనుమతిస్తారు. విమానంలో కూడా స్పష్టమైన ప్రకటన, హెచ్చరికలు జారీ చేస్తారు. గత అక్టోబర్లో ఒక దేశీయ విమానంలో పవర్ బ్యాంక్ పేలడం వల్ల విమానాన్ని మధ్యలో దింపాల్సి వచ్చింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు.

## కొడుకు గ్రాట్యుటీ, ప్రభుత్వ ఉద్యోగం కోసం.. కోడలిని చంపిన అత్త




ముంబై: మరణించిన కొడుకు గ్రాట్యుటీ డబ్బు, ప్రభుత్వ ఉద్యోగం కోసం అతడి తల్లి దారుణానికి పాల్పడింది. మరో వ్యక్తితో కలిసి కోడలిని హత్య చేసింది. ఆమె మృతదేహాన్ని ఒకచోట పడేసింది. కోడలు అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు అత్తతో పాటు ఆమెకు సహకరించిన ఫ్రెండ్‌ను అరెస్ట్ చేశారు. (Woman Kills Daughter-In-Law) మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 1న కల్యాణ్ ప్రాంతంలోని వాల్ధుని వంతెన సమీపంలో తల, ముఖంపై తీవ్ర గాయాలతో ఒక మహిళ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఆ మహిళను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఆమె ప్రమాదవశాత్తు మరణించినట్లు పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, తన కోడలు 35 ఏళ్ల రూపాలి ఉదయం నుంచి కనిపించడం లేదని 60 ఏళ్ల అత్త లతాబాయి మరునాడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వాల్ధుని వంతెన సమీపంలో లభించిన మృతదేహాన్ని కోడలు రూపాలిగా ఆమె గుర్తించింది. దీంతో అత్త తీరుపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆమెను గట్టిగా ప్రశ్నించగా కోడలిని హత్య చేసిన కారణాన్ని వెల్లడించింది. మరోవైపు లతాబాయి కుమారుడు విలాస్ రైల్వే ఉద్యోగి. 2025 సెప్టెంబర్‌లో అతడు మరణించాడు. ఈ నేపథ్యంలో సుమారు రూ.10 లక్షల గ్రాట్యుటీ డబ్బు కోడలు రూపాలికి అందాయి. అయితే ఆ డబ్బు తనకు ఇవ్వాలని అత్త లతాబాయి కోడలు రూపాలిని డిమాండ్ చేసింది. అలాగే కొడుకు ప్రభుత్వ ఉద్యోగం కోసం కోడలు దరఖాస్తు చేయడాన్ని ఆమె వ్యతిరేకించింది. 15 ఏళ్ల మనవడిని కారుణ్య ప్రాతిపదికన నియమించాలని పట్టుపట్టింది. కాగా, కోడలు రూపాలి ఒప్పుకోకపోవడంతో ఆమెను హత్య చేయాలని అత్త లతాబాయి ప్లాన్ చేసింది. డిసెంబర్ 31న రాత్రి వేళ 67 ఏళ్ల ఫ్రెండ్ జగదీష్ మహాదేవ్ మాత్రేతో కలిసి ఐరన్ రాడ్‌తో రూపాలి తలపై కొట్టి చంపారు. రక్తం మరకల దుస్తులను మార్చారు. ఆ తర్వాత రూపాలి మృతదేహాన్ని వంతెన సమీపంలో పడేశారు. మరునాడు తన కోడలు అదృశ్యమైనట్లు అత్త లతాబాయి ఫిర్యాదు చేసిందని పోలీస్ అధికారి తెలిపారు. 24 గంటల్లోనే కేసును ఛేదించినట్లు చెప్పారు. నిందితులైన లతాబాయి, మాత్రేలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# ఖాళీ కడుపుతో

## ఈ రెండు కలిపి తీసుకుంటే..?



ఉదయాన్నే ఖాళీ కడుపుతో పాలలో నానబెట్టిన ఖర్జూరాలను తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది శక్తిని అందించడమే కాకుండా రక్తహీనత, జీర్ణ సమస్యలు, శారీరక బలహీనత వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఖర్జూరం, పాలు కలిపిన ఈ మిశ్రమం సహజ ఆరోగ్య డ్రింక్ గా నిలుస్తుంది. రోజును ఆరోగ్యంగా ప్రారంభించాలనుకునే వారు ఖర్జూరాలను పాలలో నానబెట్టి తీసుకోవడం ఒక మంచి పద్ధతి. ఇది శరీరానికి కావాల్సిన శక్తిని ఇవ్వడంతో పాటు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది. ఖర్జూరాలు సహజ చక్కెరలతో పాటు ముఖ్యమైన ఖనిజాలుగా ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియంలను కలిగి ఉండటం వల్ల ఇవి ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఐరన్ తక్కువగా ఉండే వారికి ఖర్జూరాలు మంచి సహాయకారి. ఖాళీ కడుపుతో ఖర్జూరాలను తీసుకోవడం వల్ల రక్తహీనతను తగ్గించడానికి ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడే మహిళలు దీని వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు. పాలతో కలిపి తినడం వల్ల శక్తి మరింతగా పెరుగుతుంది. దీనిలోని ప్రొటీన్లు శరీర కండరాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. నానబెట్టిన ఖర్జూరాలు తక్కువ గాఢత ఉన్న చక్కెరలతో పాటు మంచి ఫైబర్ ను కూడా అందిస్తాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలకంగా ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో తినడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. దీనిలో ఉండే కరిగే ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఖర్జూరాలలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరంలో హానికరమైన మూలకాలను తొలగించడంలో సహాయపడతాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో ముఖ్యమైనవి. పాలలో ఉండే ప్రొటీన్లు, కాల్షియం కూడా ఎముకల బలానికి తోడ్పడతాయి. ఈ రెండు కలిసినప్పుడు శక్తిని ఇచ్చే పవర్ కాంబినేషన్ గా మారుతాయి. ఖర్జూరాల్లో సహజ చక్కెరలు ఉన్నా.. మధుమేహం ఉన్నవారు ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. వీరు తమ రోజువారీ షుగర్ లెవెల్స్ ను గమనిస్తూ పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే పాలతో తీసుకునే ముందు లాక్టోస్ ఇంటోలరెన్స్ ఉన్నవారా అనే విషయం కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే కొందరి వ్యక్తులకు పాలు జీర్ణ సమస్యలు కలిగించవచ్చు.

# నిద్రించేటప్పుడు మెడ కింద

## దిండ్లు పెట్టుకునే అలవాటు ఉందా?



శరీరానికి సరైన దిండును ఎంచుకోవడం ముఖ్యం. సరైన దిండు దొరకకపోతే తలకు మద్దతు లభించదు లేదా తల క్రిందికి వంగిపోవచ్చు. దీని వలన మెడ నొప్పి, తల తిరగడం, పై అవయవాలలో నొప్పి, తిమ్మిరి కూడా సంభవించవచ్చు. మంచి నిద్ర ఎవరికి ఉండదు? మనం పడుకోగానే మన శరీరానికి ఓదార్పునివ్వడానికి మెడ కింద ఒక దిండు పెట్టుకుంటాము. చాలా మంది తమ మెడ కింద ఒకటి కంటే ఎక్కువ దిండులు పెట్టుకుంటారు. కానీ ఇలా చేయడం ప్రమాదకరం. నిద్రపోయేటప్పుడు దిండు ఎంత ముఖ్యమో, దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. శరీరానికి సరైన దిండును ఎంచుకోవడం ముఖ్యం. సరైన దిండు దొరకకపోతే తలకు మద్దతు లభించదు లేదా తల క్రిందికి వంగిపోవచ్చు. దీని వలన మెడ నొప్పి, తల తిరగడం, పై అవయవాలలో నొప్పి, తిమ్మిరి కూడా సంభవించవచ్చు. గర్భాశయ వెన్నెముకను నిటారుగా ఉంచడానికి దిండును ఉపయోగించడం ముఖ్యం. సరిగ్గా సరిపోని లేదా మందమైన దిండ్లు మెడ, వెన్నెముక సమస్యలను కలిగిస్తాయి. అలాగే, దుమ్ము కణాలు, అలెర్జీ కారకాలు లేదా ఫంగస్ కూడా వాటిలో పేరుకుపోవచ్చు. ఇది అలెర్జీలు, ఉబ్బసం లేదా శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. దీనిని నివారించడానికి శరీరం సహజ ఆకృతి ప్రకారం మెడ, వెన్నెముకకు సరైన మద్దతు ఇచ్చే దిండును ఎంచుకోవడం చాలా ముఖ్యం. మెమరీ ఫోమ్, లేటెక్స్, ఫెదర్ దిండ్లు ప్రసిద్ధ ఎంపికలు. ఇవి వివిధ రకాల శరీర సమస్యలను తీరుస్తాయి. దిండును కొనుగోలు చేసే ముందు దాని సౌకర్యాన్ని పరీక్షించడం చాలా ముఖ్యం తద్వారా అది శరీరానికి అనుకూలంగా ఉందో లేదో నిర్ధారించుకోవాలి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల వెన్నెముక అమరిక సరిగ్గా ఉంటుంది. అంటే, వెన్నెముక సహజంగా నిటారుగా ఉంటుంది. ఇలా నిద్రపోవడం కడుపు మీద పడుకునే వారికి మంచిది. మెడ కింద మందపాటి దిండు ఉంచినప్పుడు వెన్నెముక ఒత్తిడికి గురవుతుంది. దీనివల్ల మెడ నొప్పితో పాటు ఇతర సమస్యలు కూడా వస్తాయి. అందుకే మీరు దిండు లేకుండా నిద్రపోతే మెడ, వెన్నునొప్పి తగ్గుతుంది. దిండును తొలగించడం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల కొన్ని నష్టాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. మీరు మీ శరీరాన్ని వంచి నిద్రపోయి, దిండును ఉపయోగించకపోతే అప్పుడు సమస్య ఉండవచ్చు. మీకు ఒత్తిడి అనిపించవచ్చు. తల వెన్నెముకకు అనుగుణంగా ఉంచడానికి మద్దతు అవసరం. మద్దతు లేకపోవడం వల్ల మెడ, భుజాలలో దృఢత్వం లేదా నొప్పి వస్తుంది. దీని కారణంగా, ఒక వ్యక్తి భుజాలు, మెడలో తీవ్రమైన నొప్పితో మేల్కొనవలసి రావచ్చు.

# ఈ ఒక్క విటమిన్‌తో

# ఆడవారిలో గుండెపోటుకు చెక్..?



ఆకుకూరలు, క్యాబేజీ రకం కూరగాయలు వృద్ధ మహిళల గుండె ఆరోగ్యానికి గణనీయంగా తోడ్పడతాయని కొత్త అధ్యయనం వెల్లడించింది. ఎడిత్ కోవాన్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా, డేనిష్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ పరిశోధన స్పినిచ్, కాలే, బ్రోకలీ వంటి కూరగాయల ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. మహిళల్లో గుండెపోటుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, పోషకాహార లోపం ఒక ముఖ్యమైన అంశం. ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్కువగా ఉండటం, అలాగే చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో మంట, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ పెరుగుతాయి. ఇవి గుండె జబ్బులకు దారితీసే కారకాలు. ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత మహిళల్లో హార్మోన్ల మార్పుల వల్ల గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది, కాబట్టి ఈ దశలో సరైన పోషకాహారం మరింత అవసరం. సమతుల్య, పోషకాలు నిండిన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఆకుకూరలు, క్యాబేజీ రకం కూరగాయలు వృద్ధ మహిళల గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఎడిత్ కోవాన్ విశ్వవిద్యాలయ అధ్యయనం ఈ విషయం వెల్లడించింది. విటమిన్ ఖ1 గుండె జబ్బులు నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చడం మేలు. ఈ కూరగాయల్లో విటమిన్ ఖ1 పుష్కలంగా ఉంటుంది. ఇది అథెరోస్క్లెరోటిక్ వాస్కులర్ డిసీజ్‌ల నివారణకు సహాయపడుతుందని పరిశోధకులు కనుగొన్నారు. గుండెపోటు, స్ట్రోక్‌ల వల్ల ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ూూఎణం ప్రధాన కారణాలు. ఈ అధ్యయనంలో 1,436 మంది వృద్ధ మహిళలు పాల్గొన్నారు. విటమిన్ ఖ1 అధికంగా తీసుకోవడం ూూఎణం ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఫలితాలు సూచించాయి. మెడలోని రక్త నాళాల మందాన్ని కూడా తగ్గించవచ్చుని, ఇది అథెరోస్క్లెరోసిస్ సూచన అని తెలిపారు. ప్రతి రోజు సుమారు ఒకటిన్నర కప్పుల ఆకుకూరలు, క్యాబేజీ రకం కూరగాయలు తీసుకోవడం ద్వారా విటమిన్ ఖ1 మోతాదు పెంచుకోవచ్చు. దీని ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. విటమిన్ ఖ1 30% అధికంగా తీసుకున్న మహిళలు ూూఎణం ప్రమాదాన్ని దీర్ఘకాలికంగా తక్కువగా కలిగి ఉన్నారని అధ్యయనం కనుగొంది. ప్రత్యేక పోషకాహార అవసరాలు ఉన్న కమ్యూనిటీల కోసం, ఉదాహరణకు వృద్ధుల సంరక్షణ కేంద్రాల్లో నివసించే వారికి, విటమిన్ ఖ1 అధికంగా ఉన్న కొత్త ఆహారాలను సృష్టించే పనిలో పరిశోధన బృందం నిమగ్నమై ఉంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూరగాయలు ఎంత ముఖ్యమో ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవాలి.

# చిక్కుల్లో మహిళల ఊపిరి..

## పురుషుల కంటే ఎక్కువ మరణాలు!



దేశంలో పురుషులకు మాత్రమే తక్షణ వైద్య సహాయం అందుతోంది. మహిళలకు వస్తున్న ఊపిరితిత్తుల వ్యాధులను పట్టించుకోవట్లేదు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి (సీఓపీడీ) విషయంలో ఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుంది. 40 ఏళ్లు దాటిన మహిళల్లో ఈ వ్యాధి విస్తృతి గణనీయంగా పెరిగినట్లు తాజాగా ఓ సమీక్షా పరిశోధన వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు ఈ ముప్పు మరింత అధికంగా ఉంది. సకాలంలో గుర్తించకపోవడం, సరైన చికిత్స అందకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. భారతదేశంలో మహిళల్లో దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి (సీఓపీడీ) తరచుగా పట్టించుకోని సమస్యగా మిగిలింది. పురుషులకు మాత్రమే తక్షణ వైద్య సహాయం అందుతోందని నిపుణులు చెబుతారు. పల్మనరీ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలు నిర్వహించిన సమీక్షా పరిశోధన ఈ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. 40 ఏళ్లు దాటిన మహిళల్లో సీఓపీడీ విస్తృతిలో గణనీయ తేడాలు కనపడ్డాయి. ఈ అధ్యయనం మైసూర్ జిల్లాలో 2006–2010 మధ్య జరిగిన పరిశోధనలు, ఒడిశాలో 2013–14లో, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడులో 2007లో జరిగిన సంబంధిత అధ్యయనాలను పరిశీలించింది. సుమారు 16.3 శాతం మహిళల్లో సీఓపీడీ ఉన్నట్లు తేలింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి మరింత ప్రబలంగా ఉంది. అనేక పరిశోధనలను విశ్లేషించగా, ప్రపంచవ్యాప్తంగా సీఓపీడీ విస్తృతిలో అసమానతలు స్పష్టంగా కనపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులకు ఈ వ్యాధి తీవ్రంగా సోకుతుంది. బయోమాస్ ఇంధనాలతో వంట చేసే మహిళలు, పొగతాగని వారు కూడా దీర్ఘకాలిక బ్రోన్కైటిస్, వాయుప్రసరణ సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఎక్కువ. సెకండరీ పొగ, పొగాకు వాడకం, తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), విద్య, అవగాహన లేకపోవడం సీఓపీడీకి ఇతర ప్రమాద కారకాలు. సీఓపీడీని మహిళల్లో సాధారణ దగ్గుగా తేలికగా తీసుకుంటారు. శ్వాసకోశ వైఫల్యం వచ్చాక లేదా పరిస్థితి తీవ్రంగా మారిన తర్వాతే మహిళలు డాక్టర్ దగ్గరకు వెళ్తారు. దక్షిణ కన్నడలోని కటీల్ ప్రాంతంలో మహిళల్లో సీఓపీడీకి కారణాలపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. భారతదేశంలో సీఓపీడీకి ముందస్తు చర్యలు లేకపోవడం వ్యాధి నిర్ధారణలో ఆలస్యం కలిగిస్తుంది. పరిశోధనలో తేలిన అంశం ఏమిటంటే, పొగ తక్కువ తాగినా, పురుషుల కంటే మహిళల్లో మరణాల రేటు ఎక్కువ. వారికి లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. మహిళల్లో వాయుమార్గ వ్యాధి తక్కువ, హార్మోన్ల ప్రభావం తక్కువగా ఉంటుంది. సీఓపీడీ వ్యక్తమయ్యే తీరులో లింగ భేదాలను ఇది సూచిస్తుంది.

## మంగళవారం హనుమంతుడికి

# పూజ చేస్తున్నారా..?



మంగళవారం హనుమంతుడికి చేసే పూజను మెరుగుపరచడానికి, స్వచ్ఛతపై దృష్టి పెట్టండి. నిర్దిష్ట వస్తువులను సమర్పించండి. హనుమాన్ చాలీసా వంటి ప్రార్థనలను పఠించండి. ఉపవాసం ఉండటం, ఎరుపు లేదా కుంకుమ రంగు ధరించడం. కొన్ని ఆహార పదార్థాలను నివారించడం కూడా శుభప్రదం. మరి మంగళవారం హనుమంతుడి పూజ విషయంలో తీసుకోవలసిన నియమాలు ఏంటి.? పరిశుభ్రత, స్వచ్ఛత, దుస్తుల నియమావళి: మీ పూజ కోసం పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించండి. ప్రారంభించే ముందు స్నానం చేయండి. మీ మనస్సు ఏకాగ్రతతో పరధ్యానం లేకుండా చూసుకోండి.

పూజ సమయంలో ఎరుపు లేదా కుంకుమ రంగు దుస్తులు ధరించండి. ఎందుకంటే ఇవి మంగళవారం పూజకు శుభప్రదంగా భావిస్తారు. నైవేద్యాలు, పారాయణం: హనుమంతుడికి సింధూరం, మల్లె నూనె, ఎర్రటి పువ్వులు, లడ్డూలు, బెల్లం సమర్పించండి. హనుమాన్ చాలీసా పారాయణం చేసి భక్తితో "రామ్ నామం" జపించండి. మంగళ్వార్ వ్రత కథ చదవడం లేదా వినడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఉపవాసం, మంత్రం: మంగళవారం నాడు ఉప్పు, ధాన్యాలు తినకుండా ఉపవాసం ఉండటం ఒక సాధారణ ఆచారం. సాయంత్రం వేళ పండ్లు, పాలు, సాబుదాన వంటి వ్రత-స్నేహపూర్వక ఆహారంతో మీరు ఉపవాసాన్ని విరమించవచ్చు. "ఓం హనుమతే నమః" లేదా "ఓం క్రం క్రీం క్రౌం సః భౌమే నమః" అనే మంత్రాన్ని జపించడం మంగళవారం పూజకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. వీటిని నివారించండి: సాధారణంగా మంగళవారం నాడు మాంసం, మద్యం తినకుండా ఉండటం మంచిది. అదనంగా, ఈ రోజున జుట్టు లేదా గోళ్లను కత్తిరించడం మానుకోండి. ఇలా చేయడం అశుభంగా పరిగణిస్తారు. మహిళలకు ప్రత్యేక పరిగణనలు: మహిళలు హనుమంతుడికి చోళ (పవిత్ర నూనె ఆధారిత నైవేద్యం) సమర్పించకూడదు. వారు విగ్రహాన్ని చరణామృతం (విగ్రహాలను స్నానం చేయడానికి ఉపయోగించే పవిత్ర జలం)తో స్నానం చేయకూడదు. కోతులకు ఆహారం పెట్టడం: ముఖ్యంగా మంగళవారం నాడు కోతులకు ఆహారం పెట్టడం వల్ల హనుమంతుడి ఆశీస్సులు లభిస్తాయని నమ్ముతారు. అరటిపండ్లు, బెల్లం వంటి పండ్లు సాధారణంగా నైవేద్యం పెడతారు.

# ఉదయం నిద్ర లేవగానే ఈ పనులు చేయకండి..!



ఉదయం లేవగానే అద్దంలో చూసుకోవడం, ఆగిపోయిన గడియారం చూడటం, క్రూరమైన జంతువుల చిత్రాలు చూడటం, శుభ్రం చేయని పాత్రలు చూడటం, నీడ చూడటం వంటివి అశుభకరమని నమ్ముతారు. ఇవి రోజంతా మనసులో ఆందోళన, భయం, ప్రతికూలతలను పెంచుతాయని పలు నమ్మకాలు చెబుతున్నాయి. అద్దంలో చూసుకోవడం: మనలో చాలా మందికి ఉదయం మంచం దిగిన వెంటనే అద్దంలో చూసుకోవడం అలవాటు. కానీ శాస్త్రాల ప్రకారం.. మనం లేచిన వెంటనే అద్దంలో మన ముఖం చూసుకోవకూడదు. ఈ అలవాటు మన జీవితంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అంటారు. ఆగిపోయిన గడియారం: ఉదయం నిద్రలేవగానే ఆగిపోయిన గడియారాన్ని చూడటం అశుభమని భావిస్తారు. ఆగిపోయిన గడియారాన్ని చూడటం వల్ల చేయవలసిన పనిలో అడ్డంకులు ఏర్పడటమే కాకుండా, జీవితంలో కొన్ని సమస్యలను కూడా కలిగిస్తాయి. క్రూర జంతువుల చిత్రాలు: ఉదయం నిద్రలేచిన వెంటనే పులులు, సింహాలు మొదలైన క్రూర జంతువుల చిత్రాలను చూడకూడదు. ఎందుకంటే ఇది రోజంతా మనస్సులో ఏదో ఒక విషయం గురించి ఆందోళనను, గందరగోళాన్ని సృష్టిస్తుంది. అలాంటి చిత్రాలు సంఘర్షణ, పోరాటాలను సూచిస్తాయని చెబుతారు. కాబట్టి మీ గదిలో జంతువుల చిత్రాలను ఉంచడం అశుభకరం. ఎంగిలి పాత్రలు: ఉదయం నిద్ర లేవగానే వంటగదిలో శుభ్రం చేయని ఎంగిలి పాత్రలు చూడటం కూడా అశుభమని భావిస్తారు. ఇది ఇంట్లోకి ప్రతికూల శక్తిని, పేదరికాన్ని తీసుకువస్తుందని కూడా నమ్ముతారు. అందుకే రాత్రిపూట పాత్రలను శుభ్రం చేయాలని అంటారు. నీడ: ఉదయం నిద్ర లేవగానే మీ స్వంత నీడను లేదా ఇతరుల నీడను చూడటం మానుకోవాలి, ఎందుకంటే నీడను చూడటం వల్ల దురదృష్టం వస్తుంది. నీడను చూడటం వల్ల ఆ వ్యక్తిలో భయం, ఒత్తిడి, గందరగోళం పెరుగుతాయని అంటారు. అందుకే మీరు సూర్యోదయానికి ముందే మేల్కొనాలి.

# సింగరేణిలో కనీస పెన్షన్ 10 వేల కోసం మరోసారి పార్లమెంట్ లో కొట్లాడతా ; ఎంపీ వంశీ కృష్ణ






రామగుండం ( ప్రశ్న న్యూస్ ) గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మంచి ఆదాయం ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసింది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ సర్కార్ ప్రజా పాలన అందిస్తుంది అని కొనియాడారు. 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతిని విస్మరించిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన రేషన్ కార్డులను ఇస్తున్నామన్నారు. సింగరేణి రిటైడ్ కార్మికులకు 10 వేల రూపాయల పెన్షన్ కావాలని పార్లమెంట్ లో ప్రసవించడం జరిగింది, మరో మారు కేంద్రం దృష్టికి తీసుకువెళ్తా అన్నారు. నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం అని వివరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కు రావాల్సిన సెమి కండక్టర్ ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చారని చెప్పారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రజల ఆశీస్సులతో న్యూయార్క్ కు వెళ్లేందుకు అవకాశం దక్కిందన్నారు. ఉపాధి హామీ పథకం ను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వం పేదల కోసం కాదు, ఆధాని అంబానీల కోసం పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి పెద్దపల్లి పార్లమెంట్ కు 4 వేల 500కోట్ల నిధులు తీసుకు రావడం జరిగిందన్నారు. రోడ్లు, రైల్వే లైన్లు, ఓవర్ బ్రిడ్జి ల కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు.

మహాత్మాగాంధీ పేరు తీసి వేసే కుట్ర కేంద్ర చేస్తుందన్నారు.ఎన్టీపీసీ లో 2400 పవర్ ప్రాజెక్టు పనుల పురోగతి పై ఎన్టీపీసీ అధికారులతో మాట్లాడటం జరిగిందనీ,విదేశాల నుండి యూరియా రాకపోవడంతో, రామగుండం ఎరువుల కర్మాగారం లో పూర్తి స్థాయిలో యూరియా ఉత్పత్తి రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి రావాల్సిన యూరియా ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం జరిగిందన్నారు.

విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్ర మంత్రిని కలవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి సర్వే కోసం 50 లక్షల రూపాయల రుసుము చెల్లించి అధికారులతో సర్వే చేయించడం జరిగిందన్నారు. సింగరేణి మారుపేర్ల సమస్య పై ప్రస్తావించడం జరిగింది, త్వరితగతిన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు.లెదర్ పార్క్ కోసం ప్రయత్నాలు కొనసాగుతన్నాయన్నారు.

# రాయలసీమ జిల్లాలకు మహర్దశ




**తిరుపతి,** దేశంలో రెండు కీలక జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. మహారాష్ట్రలో నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం, ఒడిశాలో ఔఊ-326 విస్తరణ ఈ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఈ కారిడార్లు ఏపీతో అనుసంధానం కానున్నాయి. ఈ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్ర నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అంటున్నారు..దేశంలో 2 కీలకమైన జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. రూ.20,668 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రాజెక్టును చేపడుతుంది. కేంద్రం ఆమోదించిన ఈ రెండు ప్రాజెక్టుల్లో ఒకటి మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం. మరొకటి ఒడిశాలోని ఔఊ-326 (మోహన-కోరాపుట్)ను రూ.1,526 కోట్లతో విస్తరణ. ఈ మెగా ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ కూడా అనుసంధానం కానుందిఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను సోలాపూర్ వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న సోలాపూర్-చెన్నై 4 వరుసల నేషనల్ హైవేతో అనుసంధానిస్తారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముఖ్య పట్టణాలైన ముంబై, పుణే, నాసిక్ నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే, ఏపీలోని పారిశ్రామిక హబ్‌లైన ఓర్వకల్లు, కొప్పర్తికి సరుకు రవాణా మెరుగుపడుతుంది. సోలాపూర్-చెన్నై రోడ్డు కర్ణాటకలోని కోస్గి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాతో పాటుగా ఏపీలోని కర్నూలు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా తమిళనాడులోని చెన్నై పోర్టుకు చేరుకుంటుంది.ఈ రెండు కారిడార్‌లు అనుసంధానమైతే కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లలో స్థాపించే వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకు రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పశ్చిమాది రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు కూడా ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సోలాపూర్-చెన్నై హైవేలో భాగంగా కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, హంద్రీ నదులపై భారీ బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ కారిడార్ల ద్వారా పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల అనుసంధానం కానున్నాయి. దీని వల్ల కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.ఈ కారిడార్ల ద్వారా రాయలసీమలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం జిల్లాల ప్రజలు సోలాపూర్ వెళ్లాలంటే, హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సోలాపూర్-చెన్నై హైవే నిర్మాణం పూర్తయితే కర్నూలు, మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా సోలాపూర్ చేరుకోవచ్చు. దీని వల్ల కర్నూలు నుంచి సోలాపూర్‌కు దాదాపు 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మరోవైపు, ఒడిశాలోని ఔఊ-326 రోడ్డును 206 కి.మీ. మేర విస్తరించడానికి కేంద్రం రూ.1,526 కోట్లు కేటాయించింది. దీని వల్ల మోహన-కోరాపుట్ నుంచి రాయ్‌పూర్-విశాఖపట్నం కారిడార్‌కు అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు సరుకు రవాణా వేగంగా జరుగుతుంది. ఈ ప్రాజెక్టులు మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాలకు జీవనాడిలాంటివని, ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగుపడతాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.దేశంలో 2 కీలకమైన జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. రూ.20,668 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రాజెక్టును చేపడుతుంది. కేంద్రం ఆమోదించిన ఈ రెండు ప్రాజెక్టుల్లో మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం ఒకటి కాగా.. ఒడిశాలోని ఔఊ-326 (మోహన-కోరాపుట్)ను రూ.1,526 కోట్లతో విస్తరణ ఈ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఈ మెగా ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ కూడా అనుసంధానం కానుంది.ఈ గ్రీన్‌ఫీల్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను.. సోలాపూర్ వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న సోలాపూర్-చెన్నై 4 వరుసల నేషనల్ హైవేతో అనుసంధానిస్తారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముఖ్య పట్టణాలైన ముంబై, పుణే, నాసిక్ నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే, ఏపీలోని పారిశ్రామిక హబ్‌లైన ఓర్వకల్లు, కొప్పర్తికి సరుకు రవాణా మెరుగుపడుతుంది. సోలాపూర్-చెన్నై రోడ్డు కర్ణాటకలోని కోస్గి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాతో పాటుగా ఏపీలోని కర్నూలు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా తమిళనాడులోని చెన్నై పోర్టుకు చేరుకుంటుంది.ఈ రెండు కారిడార్‌లు అనుసంధానమైతే కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లలో స్థాపించే వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకు రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పశ్చిమాది రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు కూడా ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సోలాపూర్-చెన్నై హైవేలో భాగంగా కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, హంద్రీ నదులపై భారీ బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ కారిడార్ల ద్వారా.. పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల అనుసంధానం కానున్నాయి. దీని వల్ల కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.ఈ కారిడార్ల ద్వారా రాయలసీమలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం జిల్లా ప్రజలు.. సోలాపూర్ వెళ్లాలంటే.. హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సోలాపూర్-చెన్నై హైవే నిర్మాణం పూర్తయితే కర్నూలు, మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా సోలాపూర్ చేరుకోవచ్చు. దీని వల్ల కర్నూలు నుంచి సోలాపూర్‌కు దాదాపు 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మరోవైపు, ఒడిశాలోని ఔఊ-326 రోడ్డును 206 కి.మీ. మేర విస్తరించడానికి కేంద్రం రూ.1,526 కోట్లు కేటాయించింది. దీని వల్ల మోహన-కోరాపుట్ నుంచి రాయ్‌పూర్-విశాఖపట్నం కారిడార్‌కు అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు సరుకు రవాణా వేగంగా జరుగుతుంది. ఈ ప్రాజెక్టులు మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాలకు జీవనాడిలాంటిదని, ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగుపడతాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# తమిళనాడులోకి సీబీఐ

**చెన్నై,** బీజేపీ వచ్చే ముందు సీబీఐ, ఐటీ, ఈడీ వస్తాయని కొంత మంది సెటైర్లు వేస్తూ ఉంటారు. తమిళనాడులో ఈడీ, ఐటీ చాలా కాలంగా ఉన్నాయి. తాజాగా సీబీఐ రంగంలోకి దిగింది. మిగతా రెండు డీఎంకే నేతల సంగతి చూసుకుంటే..సీబీఐ మాత్రం విజయ్ ను గురిపెట్టింది. కానీ అది రాజకీయ సమీకరణాల ఆధారంగానే ఉండనుంది.తమిళనాట రాజకీయ అరంగేట్రం చేసిన దళపతి విజయ్‌కు ఆదిలోనే భారీ సవాలు ఎదురవుతోంది. కరూర్ జిల్లాలో సెప్టెంబర్ 2025లో జరిగిన 'టీవీకే' బహిరంగ సభలో చోటుచేసుకున్న తొక్కిసలాట సంఘటనపై సీబీఐ తన విచారణను వేగవంతం చేసింది. ఈ దుర్ఘటనలో సుమారు 41 మంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలను విచారించిన సీబీఐ, త్వరలోనే స్వయంగా విజయ్‌ను కూడా ప్రశ్నించే అవకాశం ఉందన్న వార్తలు తమిళనాట రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయిగత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన భారీ రాజకీయ ర్యాలీలో ఊహించిన దానికంటే ఎక్కువ మంది అభిమానులు తరలివచ్చారు. కేవలం 10 వేల మందికి అనుమతి తీసుకున్న సభకు దాదాపు 25 వేల మందికి పైగా రావడం, సరైన రక్షణ చర్యలు లేకపోవడం వల్లే ఈ భారీ తొక్కిసలాట జరిగిందని పోలీసుల ప్రాథమిక నివేదిక పేర్కొంది. అయితే, ఇది తమ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక అధికార పక్షం చేసిన కుట్ర అని టీవీకే ఆరోపించింది. సుప్రీంకోర్టుకు వెళ్లింది.

ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించాలని సుప్రీంకోర్టు స్వయంగా సీబీఐకి అప్పగించిందిఈ కేసులో భాగంగా తాజాగా టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ బస్సీ ఆనంద్, జాయింట్ సెక్రటరీ నిర్మల్ కుమార్ , కరూర్ జిల్లా కార్యదర్శులను సీబీఐ ఢిల్లీలో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించింది. సభ నిర్వహణలో వైఫల్యాలు, సీసీటీవీ ఫుటేజ్ , వాలంటీర్ల బాధ్యతపై అధికారులు ఆరా తీశారు. అధికారుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం, సభకు విజయ్ రావడంలో జరిగిన జాప్యం వల్ల అభిమానులు అసహనానికి లోనై ముందుకు రావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు.

విచారణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో, ఈవెంట్ ఆర్గనైజర్‌గా, పార్టీ అధ్యక్షుడిగా విజయ్ బాధ్యతను కూడా సీబీఐ పరిశీలిస్తోంది. పార్టీ నేతల వాంగ్మూలాల ఆధారంగా విజయ్‌కు కూడా సమన్లు జారీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే విజయ్ రాజకీయ వ్యూహాన్ని బట్టి సీబీఐ చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పెట్టుకున్న విజయ్ ముందు ముందు బీజేపీ గండాన్ని దాటాల్సి ఉంది

## వల్లభనేని వంశీ

# మళ్లీ గాయబ్..

**విజయవాడ,** సామాన్యుడికి కేసులు, కోర్టులు అంటే భయం. ఎందుకంటే మంచి భవిష్యత్తు పోతుంది.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ రాజకీయ పార్టీల నేతలకు అలా కాదు. వారికి కేసులు అనేవి కామన్. జైలు జీవితం అనేది సర్వసాధారణం. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పరారీ అయినట్లు వార్తలు వస్తున్నాయి.. ఓ కేసు విషయంలో ఆయనకు అరెస్టు తప్పదని ప్రచారం నడుస్తోంది. తన కార్యాలయం వద్ద ఆందోళన చేసిన టిడిపి కార్యకర్త పై దాడి చేశారన్న ఫిర్యాదు పై ఆయనను అరెస్టు చేస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇప్పుడు ఆయనతో పాటు అనుచరులు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అందులో ఎంత నిజం ఉందో చూడాలి.2019లో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫిరాయించారు వల్లభనేని వంశీ మోహన్. ఆ సమయంలో ఆయన కేవలం చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడడానికే అన్నట్టు ఉండేవారు. కేవలం దానికోసమే ఆయనను వైసీపీలోకి రప్పించినట్లు అప్పట్లో వ్యవహారం నడిచేది. నోటికి ఎంత వస్తే అంత మాట అనేవారు వల్లభనేని వంశీ మోహన్. ఒకానొక దశలో చంద్రబాబు సతీమణి కోసం కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు లోకేష్. రెడ్ బుక్ లో అందరి పేర్లు రాస్తున్నానని.. తప్పకుండా అందరిపై చర్యలు ఉంటాయని అప్పట్లో హెచ్చరించారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వల్లభనేని వంశీ మోహన్ విషయంలో పెద్దగా కలుగ చేసుకోలేదు. అయితే వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి జరిగింది. అప్పటి కేసును ఉపసంహరించుకోవాలని కోరుతూ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ పై ఒత్తిడి చేశారు వల్లభనేని వంశీ మోహన్. బాధితుడు ఫిర్యాదుతో ఆ కేసు మళ్లీ మొదలైంది. అలా ఒక్కో కేసు వల్లభనేని వంశీ మోహన్ మెడకు చుట్టుకుంది. దాదాపు 5 నెలలకు పైగా రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు వల్లభనేని వంశీ మోహన్. పలుమార్లు జైలులో అస్వస్థతకు కూడా గురయ్యారు. అయితే బెయిల్ పై బయటకు వచ్చిన ఆయన అనారోగ్యానికి గురి కావడంతో కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకున్నారు. ఇటీవల రాజకీయ పరామర్శలు చేస్తున్నారు. పొలిటికల్ గా యాక్టివ్ అవుతున్నారు.అయితే ఇప్పుడు మరోసారి వల్లభనేని వంశీ అరెస్ట్ జరుగుతుందని ప్రచారం నడిచింది. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో తెలుగుదేశం పార్టీ ఒక నిరసన కార్యక్రమం చేసింది. వల్లభనేని వంశీ మోహన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఓ టిడిపి కార్యకర్తపై అనుచరులతో దాడి చేయించారన్నది ఆయనపై వచ్చిన అభియోగం. ఎప్పుడో నెలల కిందట వచ్చిన ఫిర్యాదు పై ఇప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు సిద్ధపడ్డారు. దీంతో వల్లభనేని వంశీ మోహన్ తో పాటు ఆయన అనుచరులు కనిపించకుండా మానేశారు. అప్పటినుంచి వల్లభనేని వంశీ మోహన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు ప్రచారం జరిగింది. కానీ ఆయన ముందస్తు బెయిల్ కోసం అలా చేసి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి కేసులు ఎదుర్కొని బెయిల్ పై బయటకు వచ్చాక అంత ఈజీగా మళ్లీ జీవితం ఉండదని చెబుతున్నారు. ఎందుకంటే అంతకు ముందు కేసుల్లో బెయిల్ తీర్పులను ఆధారంగా చేసుకుని న్యాయపరంగా ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. కేవలం కోర్టు నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తారే తప్ప అజ్ఞాతంలోకి వెళ్లారన్నది మెజారిటీ విశ్లేషకుల అభిప్రాయం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

# కాపు నేతలకు గాలం

**కాకినాడ,** ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటినుంచి పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. సామాజిక వర్గాలను తెరపైకి తెచ్చి మరోసారి విజయం అందుకోవాలని భావిస్తోంది. కానీ అది అంత సులువుగా దక్కేలా లేదు. ఎందుకంటే 2014 నుంచి 2024 వరకు వైసిపి చేపట్టిన ఈ ఫార్ములా ఆ పార్టీకి వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు ఎంత మాత్రం అది సాధ్యమయ్యే అవకాశం లేదు. కుల సమీకరణల ద్వారా రాజకీయం చేస్తామంటే కుదిరే పని కూడా కాదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని కాపు సామాజిక వర్గంపై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతం మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే నినాదం పక్కకు వెళ్లిపోయినట్లు సమాచారం.వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్ అనేది రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ సామాజిక వర్గాలే ఉండేవి. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడడానికి కారణం ఆ రెండు సామాజిక వర్గాలు మాత్రమే. రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గ ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో అక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలిగింది. ఎస్సీలతో పాటు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో గెలవగలిగింది వైయస్సార్ కాంగ్రెస్. అయితే 2019 ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాలు స్టాండ్ అయ్యాయి. ఆపై మిగతా సామాజిక వర్గాలు సహకరించాయి. దీంతో అంతులేని, అద్భుత విజయం సొంతం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ 2024 ఎన్నికలు వచ్చేసరికి బీసీ నామస్మరణ చేశారు జగన్మోహన్ రెడ్డి. ఎలాగూ సంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటుందని భావించి అలా చేశారు. కానీ రాజకీయంతో పాటు ఆర్థికంగా ఏమాత్రం సహకారం అందకపోవడంతో రెడ్డి సామాజిక వర్గం మౌనం దాల్చింది. ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు చీలిపోయి దారుణ పరాజయం ఎదురైంది.ఇప్పుడు కూడా కుల సమీకరణల ద్వారా రాజకీయాలు చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. పవన్ కళ్యాణ్ వెంట కాపు సామాజిక వర్గం ఉందన్న ఆలోచనతో ముద్రగడ పద్మనాభం, చేగొండి హరి రామ జోగయ్య, వంగవీటి మోహన్ రంగా వంటి కుటుంబాలను ఆకర్షించాలని చూస్తున్నారు. ఇప్పటికే ముద్రగడ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. చేగొండి హరి రామ జోగయ్య వైసీపీకి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమార్తె ఆశ కిరణ్ ను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పేరు మోసిన కుటుంబాలు వైసీపీలోకి వస్తే చాలదు. క్షేత్రస్థాయిలో కాపు సామాజిక వర్గంలో ఆశలు చిగురించే ప్రయత్నాలు జరగాలి. వారి సమస్యల పట్ల జగన్మోహన్ రెడ్డి స్పందించాలి. అంతేతప్ప ప్రముఖుల కుటుంబాలను కాపుల్లో చేర్చితే ఎంత మాత్రం వర్కౌట్ కాదు. 2014లో టిడిపి గెలిచిన తర్వాత ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమం లేవనెత్తారు. ఆ సమయంలో కాపులు టిడిపి పట్ల ఆగ్రహంతో ఉండేవారు. అలా వారు వైసిపి వైపు వెళ్లారు. కానీ ఆ పోరాటం చేసిన ముద్రగడ పద్మనాభం 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. కానీ ఆ పార్టీని నమ్మలేదు కాపులు. ఇప్పుడు కూడా కాపు ప్రముఖులను నమ్ముకుంటే కంటే.. కాపుల కోసం చేసే ప్రయత్నాలతో పాటు ప్రకటనలు, పోరాటాల వారికి ఆకట్టుకునేలా చేస్తాయి. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

# సిద్ధప్పకు కొత్త సెగ

**బెంగళూరు,** కర్ణాటక రాజధానిలో యలహంక సమీపంలోని కోగిలు లేఅవుట్ కూల్చివేతలు ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా వెలసిన ఆక్రమణలను తొలగించాలని ఒకవైపు కోర్టులు, పౌర సమాజం ఒత్తిడి తెస్తుంటే.. మరోవైపు అక్కడ నివసిస్తున్న భారీ ముస్లిం మైనారిటీ వర్గాల ఓటు బ్యాంకును కాపాడుకోవాల్సిన సంకట స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకుంది.కోగిలు లేఅవుట్‌లో సుమారు 20-30 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన వందలాది ఇళ్లను తొలగించడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే, ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ వసతి లేదా పునరావాసం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం కొత్త వివాదానికి తెరలేపింది. అక్రమంగా భూమిని ఆక్రమించిన వారికి ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లు కట్టించి ఇవ్వడం ఏంటని అన్ని వర్గాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ఆక్రమణదారుల్లో అధిక శాతం ముస్లింలు ఉన్నందుకే ప్రజాధనం ధారబోస్తున్నారని బీజేపీ ఆరోపిస్తోంది.కాంగ్రెస్ పార్టీకి సంప్రదాయకంగా అండగా ఉండే ముస్లిం ఓటు బ్యాంకు ఇక్కడ కీలకంగా మారింది. ఒకవేళ కఠినంగా వ్యవహరించి ఇళ్లను కూల్చివేస్తే ఆ వర్గంలో తీవ్ర వ్యతిరేకత వస్తుందని, అది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని ప్రభుత్వం భయపడుతోంది. కొంత మొత్తం కూల్చివేతలతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ హైకమాండ్ కూడా అసహనం వ్యక్తం చేసింది. దీంతో పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల కోసం కట్టిన ఇళు ఇవ్వడానికి సిద్ధపడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి.ఈ వ్యవహారంలో సిద్ధరామయ్య ప్రభుత్వం అటు చట్టపరమైన చిక్కులు, ఇటు సామాజిక విమర్శల మధ్య ఇరుక్కుపోయింది. ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన బాధ్యత ఉన్నా, సొంత వర్గాల ప్రయోజనాల కోసం నిబంధనలను పక్కన పెడుతున్నారనే ముద్ర పడుతోంది. కేవలం ఒక వర్గానికి మేలు చేసేలా పునరావాస ప్యాకేజీలు ప్రకటిస్తే, భవిష్యత్తులో నగరంలోని మిగిలిన ఆక్రమణల తొలగింపు ప్రభుత్వానికి అసాధ్యంగా మారుతుంది. కోగిలు లేఅవుట్ అంశం కేవలం ఆక్రమణల తొలగింపు సమస్య మాత్రమే కాదు, అది కర్ణాటకలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు సంకేతగా మారుతోంది. అనాలోచిత నిర్ణయాలతో సమస్యను సిద్ధరామయ్య మరింత క్లిష్టంగా మార్చుకుంటున్నారు.

## మరో మలయాళ చిత్రానికి
# అభిమానులు ఫిదా..
### - పది రోజుల్లోనే వంద కోట్లు..!



మలయాళ చిత్రసీమలో యువ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నివిన్ పౌలీ నటించిన తాజా చిత్రం 'సర్వం మాయ' . ఈ మూవీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కామెడీఉహారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు అఖిల్ సత్యన్ దర్శకత్వం వహించారు. రియా శిబు, ప్రీతి ముకుందన్, అజు వర్గీస్, జనార్దనన్, అల్తాఫ్ సలీం తదితరులు కీలక పాత్రల్లో నటించారు. క్రిస్మస్ స్పెషల్‌గా విడుదలైన ఈ చిత్రం తొలి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. మోహన్ లాల్ నటించిన భారీ పాన్ ఇండియా మూవీ 'వృషభ'తో పోటీగా థియేటర్లలోకి వచ్చినప్పటికీ, 'సర్వం మాయ' తనదైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పించింది.

# వర్క్ ఫ్రమ్ హోమ్ కష్టాలు.. సుఖాలు : ఆసక్తికరంగా త్రిగుణ్ కొత్త సినిమా టీజర్




విలక్షణమైన పాత్రలతో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటుడు త్రిగుణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను చిత్ర యూనిట్ ఘనంగా విడుదల చేసింది. త్రిగుణ్ సరసన పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటించగా, ప్రముఖ నటుడు అనీష్ కురువిల్లా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం ఈ చిత్రాన్ని నిర్మించారు. జ.స.ఎ.నా.చీ బాబ్జీ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.టీజర్ లాంచ్ కార్యక్రమంలో హీరో త్రిగుణ్ మాట్లాడుతూ సినిమాపై తనకున్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకకి విచ్చేసిన అతిథులు అందరికీ నమస్కారం. గత కొన్ని రోజులుగా చిన్న సినిమాలన్నీ అద్భుతంగా ఆడుతున్నాయి .అందరికి ఒక హోప్ వచ్చింది. సినిమాలు చూడడం థియేటర్ కి రావడం చాలా ఆనందంగా ఉంది. బాబ్జి గారికి థాంక్యూ తక్కువ టికెట్ ధరల్లో పెడితే ఆడియన్స్ అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాను. మోడరన్ లైఫ్, పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాల్లో చాలా ఇంట్రెస్టింగ్ గా చూపించారు. చాలా ముఖ్యమైన విషయాలు ఇందులో చెప్పాం. మనమందరం కూడా వ్యవసాయం నుంచే వచ్చాము. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అన్ని తరాలు కూడా వ్యవసాయం నుంచే వచ్చాయి. వ్యవసాయం గురించి ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడుతూనే సినిమా చాలా ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఈ సినిమాకి పని చేసిన అందరికీ పేరుపేరునా థాంక్ యూ. త్వరలోనే రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేస్తాం. తప్పకుండా ఈ సినిమాని మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను.డైరెక్టర్ మధుదీప్ మాట్లాడుతూ అందరికి నమస్కారం. నేను ఈ ఇండస్ట్రీలో ఉండడానికి కారణం చంటి గారు. ఆయన లేకపోతే ఈ జర్నీ ఇంత స్మూత్ గా జరిగేది కాదు. ఈ వేడుకకు విచ్చేసిన అతిథులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. చినప్పుడు విన్న ఒక మాట నా మనసులో బలంగా ముద్రపడిపోయింది. వ్యవసాయ భూమి ఎందుకు అమ్ముకోవాల్సి వస్తుందంటే.. వ్యవసాయం చేసే విధానంలో మార్పు రావాలి.. ఈ ఆలోచనతో చేసిన కథ. ఇది చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాకి టాప్ టెక్నీషియన్స్ పనిచేశారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ హత్తుకునేలా వుంటుంది. హీరో త్రిగుణ్ గారితో వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది మాది. 5 ఏళ్ల జర్నీ. మొదటి రోజు ఎలా ఉన్నామో ఇప్పుడు అలానే ఉన్నాము.

బాబ్జి గారు చాలా మంచి మనిషి. ఈ సినిమా మొదలైనప్పటి నుంచి ఎండ్ కార్డ్ వరకు మీ మొహం లో చిరునవ్వు ఎక్కడికి పోదు. ఈ సినిమా ఆనందంపజేస్తుంది, ఆలోచింపచేస్తుంది. సినిమా చూసిన తర్వాత అందరూ కూడా చిరునవ్వుతో బయటకు వస్తారు.

## మారుతి కామెంట్స్
## తప్పుగా వెళుతున్నాయా..
### - ప్రభాస్ అభిమానుల్లో టెన్షన్



ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది రాజా సాబ్' విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సినిమా చుట్టూ చర్చలు మరింత హాట్ హాట్‌గా మారుతున్నాయి. జనవరి 9న థియేటర్లలోకి రానున్న ఈ హారర్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ క్రమంలో దర్శకుడు మారుతి ప్రమోషన్లలో భాగంగా వరుసగా మీడియాతో మాట్లాడుతున్నారు. అయితే, ఆయన చేస్తున్న వ్యాఖ్యలే ఇప్పుడు అభిమానుల మధ్య కొత్త డిస్కషన్‌కు దారి తీస్తున్నాయి. మారుతి ఇంటర్వ్యూల్లో సినిమా గురించి చెప్పే విషయాలు పూర్తి సందర్భంలో ఉన్నప్పటికీ, వాటిలోని కొన్ని మాటలే సోషల్ మీడియాలో వేరే విధంగా వైరల్ అవుతున్నాయి. దీని వల్ల ఆయన చెప్పిన మాటల ఉద్దేశ్యం కొంత మారినట్టు అనిపిస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఒకే వాక్యాన్ని కట్ చేసి షేర్ చేయడం వల్ల అనవసరమైన అపోహలు వస్తున్నాయని వారు అంటున్నారు. ఈ ఇంటర్వ్యూల్లో దర్శకుడు సినిమా మేకింగ్‌కు సంబంధించిన పలు ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. ఏఐ టెక్నాలజీ వినియోగం, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాల డిజైన్, క్లైమాక్స్ నిర్మాణం వంటి విషయాలపై ఆయన మాట్లాడారు. అలాగే హీరోగా ప్రభాస్ పాత్రకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని కూడా వివరించారు. అయితే "ప్రభాస్ కోరుకున్న విధంగానే సినిమా రూపొందింది" అన్న వ్యాఖ్యను కొందరు అభిమానులు వేర్వేరు కోణాల్లో తీసుకుంటున్నారు. అభిమానుల మాటల్లో చెప్పాలంటే, దర్శకుడు తన కథన శైలి, తన విజన్‌పై ఎక్కువగా దఅష్టి పెట్టి మాట్లాడితే బాగుండేదన్న అభిప్రాయం ఉంది. స్టార్ హీరో పేరు ఎక్కువగా ప్రస్తావించడంతో సినిమా మీద అనవసరమైన చర్చలు మొదలయ్యే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో చిన్న మాట కూడా పెద్ద రియాక్షన్‌కు దారి తీస్తుందని అభిమానులు గుర్తు చేస్తున్నారు.

## బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్
# 'శంబాల'..




టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదఅష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసుందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నాటి నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) చిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబోతే, పాలకు బదలు రక్తం కారుతుంటుంది. ఆ ఆవుని చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊరి జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు.

అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.

## సంక్రాంతి బరిలో మెగాస్టార్
### మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ లెక్కలు ఇవే!




మెగాస్టార్ చిరంజీవి తన 157వ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సఅష్టించేందుకు సిద్ధమయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు షైన్ స్క్రీన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంపై కనీవినీ ఎరుగని రీతిలో బిజినెస్ జరిగినట్లు తెలుస్తుంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా సుమారు రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందగా.. ప్రచార ఖర్చులతో కలిపి మొత్తం బిజినెస్ రూ. 225 కోట్ల నుండి రూ. 250 కోట్ల మధ్య జరిగినట్లు తెలుస్తోంది. కేవలం థియేట్రికల్ రైట్స్ ద్వారానే కాకుండా, నాన్-థియేట్రికల్ పరంగా కూడా ఈ సినిమా సంచలనం సఅష్టిస్తోంది.తెలుగు రాష్ట్రాల్లోనే ఈ సినిమా 105 కోట్ల మేర బిజినెస్ సాధించినట్లు సమాచారం. ఇందులో ఆంధ్రా హక్కులు 55 కోట్లు, నైజాం 32 కోట్లు, సీడెడ్ వాటా 18 కోట్లుగా ఉంది. ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ సినిమా సత్తా చాటుతూ నార్త్ అమెరికా హక్కులు 20 కోట్లకు అమ్ముడయ్యాయి, అక్కడ బ్రేక్ ఈవెన్ సాధించాలంటే కనీసం 5 మిలియన్ డాలర్ల వసూళ్లు రాబట్టాల్సి ఉంటుంది.మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా 260 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేసిన ఈ సినిమా, క్లీన్ హిట్ అనిపించుకోవాలంటే కనీసం 450 నుంచి 500 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించాల్సి ఉంది. థియేట్రికల్ బిజినెస్‌తో సంబంధం లేకుండా శాటిలైట్ హక్కులు 50 కోట్లకు, అలాగే ఓటీటీ హక్కులు కూడా భారీ ఫ్యాన్సీ ధరకు అమ్ముడవ్వడంతో నిర్మాతలు ఇప్పటికే టేబుల్ ప్రాఫిట్‌లో ఉన్నట్లు సమాచారం. చిరంజీవి సరసన నయనతార, క్యాథరీన్ త్రెసా నటిస్తుండగా, విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్రలో అలరించనున్నారు. సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, భీమ్స్ సిసిరిలియో సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలంగా మారాయి.

# భారీ 'ది రాజా సాబ్'..
## అంచనాలతో ఐదు రోజుల్లో థియేటర్లలోకి, బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.500 కోట్లు

ఇండియన్ సినిమా స్థాయిని మార్చిన భారీ యాక్షన్, పీరియాడిక్ చిత్రాల తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పూర్తిగా భిన్నమైన దారిలో అడుగుపెడుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'ది రాజా సాబ్' మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ప్రభాస్‌ను యాక్షన్ హీరోగా మాత్రమే చూసిన ప్రేక్షకులకు, ఈ సినిమా పూర్తిగా వినోదాత్మక హారర్ కామెడీ అవతార్‌లో చూపించబోతోంది. దర్శకుడు మారుతి తన మార్క్ కామెడీకి హారర్ ఎలిమెంట్స్ జోడించి, ప్రభాస్ ఇమేజ్‌కు కొత్త డైమెన్షన్ ఇచ్చే ప్రయత్నం చేశారని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ పాత్రలో చలాకీతనం, టైమింగ్, కామెడీ అన్నీ కీలకంగా ఉండబోతున్నాయట. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే లక్ష్యంగా కథను డిజైన్ చేసినట్లు సమాచారం. సంజయ్ దత్, బోమన్ ఇరానీ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించడంతో కథకు బలమైన బరువు వచ్చింది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ముగ్గురు హీరోయిన్లు ఉండటం మరో ప్రత్యేకతగా మారింది.భారీ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, ఈ సినిమా విజువల్ గ్రాండియర్ కంటే కంటెంట్, ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఎక్కువగా ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ ప్రభాస్ అభిమానులతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకున్నాయి. యు/ఏ సర్టిఫికెట్ రావడంతో అన్ని వర్గాల ప్రేక్షకులు సినిమా చూడగలిగేలా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారు. వ్యాపారపరంగా కూడా 'ది రాజా సాబ్' ప్రత్యేకంగా నిలుస్తోంది. పాన్ ఇండియా రిలీజ్ కావడంతో అన్ని భాషల్లో థియేట్రికల్ హక్కులకు మంచి డిమాండ్ ఏర్పడింది. సంక్రాంతి సీజన్ కావడం సినిమాకు మరింత కలిసివచ్చే అంశంగా మారింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఐవీవై ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబట్ల, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని నిర్మించగా, సుమారు రూ.400-450 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుని యు/ఏ సర్టిఫికెట్ పొందింది. కుటుంబ ప్రేక్షకులను దఅష్టిలో పెట్టుకుని తెరకెక్కిన ఈ చిత్రానికి దాదాపు 183 నిమిషాల రన్‌టైమ్ ఫిక్స్ చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో థియేట్రికల్ హక్కులు సుమారు రూ.120 కోట్లకు, హిందీ హక్కులు రూ.30 కోట్లకు, తమిళ హక్కులు రూ.8 కోట్లకు, కర్ణాటక హక్కులు రూ.15 కోట్లకు, కేరళలో రూ.4 కోట్లకు విక్రయమైనట్లు సమాచారం. ఇక విదేశీ మార్కెట్‌లో కూడా 'ది రాజా సాబ్' రైట్స్ రికార్డు స్థాయిలో అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. నార్త్ అమెరికాలో థియేట్రికల్ హక్కులను సుమారు 9 మిలియన్ డాలర్లు, అంటే భారతీయ కరెన్సీలో దాదాపు రూ.80 కోట్లకు ప్రముఖ సంస్థ సొంతం చేసుకున్నట్లు టాక్. ఈ లెక్కలన్నింటిని కలిపి చూస్తే ఈ చిత్రానికి సుమారు రూ.250-260 కోట్ల వరకు ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ అంచనా. ఈ లెక్కల ప్రకారం 'ది రాజా సాబ్' సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ.500 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించాల్సి ఉంటుందని విశ్లేషిస్తున్నారు.



# సమాజ అభివృద్ధే లక్ష్యంగా పద్మశాలి సంఘం ఎన్నికలు

- బూరుగుపల్లి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక
- పద్మశాలి నూతన అధ్యక్షులుగా శ్రీపతి రవీందర్ ఏకగ్రీవం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి, పదవులను ఖరారు చేశారు. అధ్యక్షులుగా శ్రీపతి రవీందర్, ఉపాధ్యక్షులుగా కారంపురి రాజేంద్ర ప్రసాద్,ప్రధాన కార్యదర్శిగా మ్యాన వెంకటేష్ గౌరవ అధ్యక్షులుగా పచ్చునూరి సుధాకర్, కోశాధికారిగా పచ్చునూరి దామోదర్,ముఖ్య సలహాదారులుగా ఆడెపు నర్సయ్య, శ్రీపతి దేవయ్య సంయుక్త కార్యదర్శిగా వడ్లకొండ విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులుగా కారంపురి తిరుపతి,పెంట సత్యనారాయణ,మ్యాన భాస్కర్,కారంపురి మల్లేశం, ఆడెపు పోషెట్టి లను2 ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం సంఘాన్ని మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి నుంచి సమాజ సంక్షమ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సభ్యులు ఆకాంక్షంచారు.

# ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలి

- ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు : అతికం రాజశేఖర్ గౌడ్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి నెలలో ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార వాతావరణం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించలేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ కార్యక్రమాలు, ప్రచార పర్వం విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతాయని పేర్కొన్నారు. అందువల్ల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశాన్ని పరిశీలించి మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ గడ్డం వంశీకృష్ణ పెద్ద పెల్లి జిల్లాలో పర్యటించారు



మంథని ( ప్రశ్న న్యూస్) గోదావరిఖనిలోని 11 ఇంక్లైన్ గనిని సందర్శించి, గని కార్మికులతో కలిసి అల్పాహారం చేస్తారు. ఉదయం 11:00 గంటలకు మంథని నియోజకవర్గంలోని సుందిళ్ల లక్ష్మనరసింహ స్వామి వారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు ఓదెల ఉ కొలనూరు రైల్వే గేట్ ప్రాంతాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు సుల్తానాబాద్‌లో కాక వీరాభిమాని రాహుల్ గారి పుత్రుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొంటారు. ఈసాయంత్రం 2:30 గంటలకు ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో మేకల కుమార్ గారిని పరామర్శిస్తారు. సాయంత్రం 3:00 గంటలకు ధర్మారం మండలంలో సాక్ష రిపోర్టర్ స్వామిరెడ్డి గారిని పరామర్శిస్తారు. సాయంత్రం 3:30 గంటలకు ధర్మపురి మండలం బుగ్గారం గ్రామంలో బాదినేని రాజేందర్ గారి కుటుంబాన్ని పరామర్శిస్తారు. సాయంత్రం 4:30 గంటలకు పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ గారిని నంచర్లలో పరామర్శిస్తారు. ఆ తర్వాత మంత్రుల పర్యటించి కొవ్వ రాయలింగ్ గారి కుమారుడైన కోవూరు వేణు వాళ్ళ అల్లుడు చనిపోతే వారిని మర్యాదపూర్వకం కలిసి వారిని మందలించాడు ఈ కార్యక్రమంలో అప్పల పోచమల్లు ఎడ్ల కృష్ణయ్య గురుమూర్తి నూకల బానయ్య నూకల శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# వారం రోజుల డ్రంకన్ డ్రైవ్ లో 102 కేసులు,జరిమానా 9,50,000



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి పోలీస్ స్టేషన్ సరిహద్దులలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగముగా తేదీ 29-12-2025 నుండి 31-12-2025 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 102 కేసుల నమోదు చేయడం జరిగింది. వీరినందర్నీ సంబంధిత కోర్టులలో హాజరుపరచగా ఈ 102 మందికి కోర్టు లో హాజరు పరుచగా వీరికి రూ. 9,50,000/- జరిమానా విధించడం జరిగింది. ఇందులో 7 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్., తెలియజేశారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు,వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరని తెలియజేశారు.

# డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం-కుమార్ యాదవ్

కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్) యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా డ్రగ్స్ రహిత సమాన్ని నిర్మిచాలని మేరా యువభారత్ సభ్యులు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ లో ఆయన ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అవగాహన యువ చైతన్య యాత్ర నిర్వహించారు. ముఖ్య అతిధులు గా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నుండి సబ్ ఇన్ స్పెక్టర్ అప్పారావు ,నాయకులు రవీందర్ రావు, నర్సింగ్ యాదవ్, దుర్గ ప్రసాద్,జిల్లా గణేష్ కృష్ణం రాజు, స్రవంతి , సయ్యద్,మహేష్ హాజరయ్యారు. కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ గంజాయి మహమ్మారి వలన నిర్వీర్యం అవుతున్న యువత జీవితాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదని, యువత సేవ మార్గాన్ని ఎంచుకొని సమాజ సేవలో ముందుండటానికి ప్రయత్నం చేస్తే చెడు ఆలోచనల నుండి మంచి మార్గంలోకి రావచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెహమాన్,యూత్ సభ్యులు రామకృష్ణ, సందీప్, సాయి కృష్ణ రెడ్డి,అశోక, బాలు యాదవ్,నాగరాజు, రవి,,సురేష్,






చాంద్ పాషా,భరత్ , శ్యాంసన్, సాయి, పెద్ద ఎత్తున యువత,మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య నిరుపేదల కోసం ప్రతినెల ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పెన్షన్

-అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఆర్యవైశ్యులు అంటేనే మానవతా, సహాయానికి మనసున్న మారాజు లాంటివారని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం కిషన్ గంజిలోని ఆర్యవైశ్య సంఘంలో నిరుపేద ఆర్యవైశ్యలకు ధనపాల్ లక్ష్మిబాయి-విట్టల్ గుప్తా ట్రస్ట్ ఆర్థిక సహకారంతో అలాగే ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేదలకు ప్రతినెల 500 రూపాయలు పెన్షన్ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో ఆర్యవైశ్య సంఘం నుండి 300 రూపాయలు, తన ట్రస్టు ద్వారా 200 రూపాయలు మొత్తం 500 రూపాయలు ప్రతినెల నిరుపేద ఆర్యవైశ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 72 మందికి తమ ద్వారా పింఛన్ అందుతున్నట్లు ఆయన చెప్పారు. అలాగే అందించే 500 పెన్షన్ తో పాటు ప్రతి నెల దాతలు ముందుకు వచ్చి 500 రూపాయల పింఛన్ తో పాటు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందివ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య పేద ప్రజలకు ప్రభుత్వం నుండి ఇండ్ల స్థలాలు రాకున్నా, పింఛన్ రాకున్నా తన క్యాంపు కార్యాలయానికి వచ్చి పేరు నమోదు చేసుకొని వెళ్ళవచ్చని వారికి అర్హులైతే పింఛన్ వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముక్కా దేవేందర్ గుప్తా , ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు దన్పాల్ శ్రీనివాస్ గుప్తా , ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా , గాలి నాగరాజు గుప్తా , లాబిశెట్టి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవం

- శ్రీ శైలేశ్వర సిద్దేశ్వర ఆలయంలో 129 వ సంగీత విభావరి
- కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ తిరుపతయ్య బృందం



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని శ్రీ శైలేశ్వర సిద్దేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ కార్యక్రమం వైభవపీతంగా నిర్వహించారు. వరంగల్ కు చెందిన సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తిరుపతయ్య, ఇతర సంగీత గురువుల ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ఆలపించిన శ్రీ త్యాగరాజ కీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. మంథనిలోని ఈ ఆలయంలో నిర్వహించిన మా ఈ 129వ శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవం మాకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని మంథని సంగీత కళాశాలలో మృదంగం విధ్వాన్సులుగా విధులు నిర్వహిస్తున్న భీమా శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి కనకమాలక్ష్మ మాట్లాడుతూ మంథని మంచి భక్తికి ఆరాధనకు నిలయమని ఈరోజు ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ప్రతినిత్యం సప్త హాలు, ఆలయాల్లో ఎక్కాహం, శ్రీ లక్ష్మ నారాయణ స్వామి దేవాలయంలో ధనుర్మాస భక్తి కార్యక్రమాలు, శ్రీ మహాలక్ష్మ ఆలయంలో నిర్వహించే కార్తీక మాసం భక్తి కార్యక్రమాలు, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిర్వహించే నవరాత్రి ఉత్సవములు ఈ ప్రాంత భక్తి ప్రవృత్తులకు నిదర్శనం అన్నారు. వరంగల్లోని ఆక్స్ఫర్డ్ హైస్కూల్లో ప్రొఫెసర్ వెంకటరమణ సంగీత ల ఆధ్వర్యంలో ప్రతినెల మొదటి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ?

ఈ కార్యక్రమ నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు లోకే శరత్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆలయ నిర్వాహకులు న్యాయవాది లోకే రాధా కిషన్ రావు, లోకే శరత్ లను వారు మొదట సన్మానించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ గాయకుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని పట్టణ సంగీత విద్వాంసకులు వి లక్ష్మణాచారి, ఎం సృజన్, షణ్ముఖ ప్రియా, మధులిక, సంతోష్, యజ్ఞంభట్ల లక్ష్మరాజ్యం, శ్రీరంభట్ల నరహరి, అవధానుల శ్రీనివాస్, రామడుగు శారద, రామడుగు శ్రీనివాస్, గట్టు మాధవి, మారుపాక నిఖిలతో పాటు అవదానుల మధు, రావి కంటి మనోహర్, కాచే జగన్, మహావాది సతీష్ కుమార్, జంబోజి రాజేశం, కొల్లారపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ దిష్టిబొమ్మ దహనం




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) వెనుజులపై అమెరికా బాంబుల దాడులు, అధ్యక్షుడు నికోలస్ మదురో , ఆయన భార్యను కిడ్నాప్ చేయడాన్ని అంతర్జాతీయ ఉగ్రవాద చర్యగా పి డి ఎస్ యూ, పి వై ఎల్, ఇఫ్టు, పి ఓ డబ్ల్యు , ఏఐకేఎంఎస్ ప్రజాసంఘాలు అభివర్ణించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో గాయత్రి నగర్ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మల్లికార్జున్ , జన్నారపు రాజేశ్వర్, వనమాల్ సత్యం,ఆకుల అరుణ లు మాట్లాడుతూ అమెరికా వెనుజులా దేశ సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశ నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్ర వేసి అరెస్టు చేయటం ఆధునిక వలసవాద దురంకారానికి నిదర్శనం అని అన్నారు, ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నుకోబడిన అధ్యక్షన్ని ఆయన భార్యను కిడ్నాప్ చేయడం అంతర్జాతీయ చట్టాలను హక్కులను ఉల్లంఘించడమేనని, సామ్రాజ్యవాద దౌర్జన్యానికి వ్యతిరేకంగా అమెరికా యుద్ధోన్మద చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు వెనుజులా కు మద్దతుగా నిలవాలని కోరారు, వెంటనే వెనుజులా దేశం నుంచి అమెరికా వైమానిక బలగాలని వెనక్కి తీసుకోవాలని అరెస్టు చేయబడిన వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మధుర తో పాటు ఆయన భార్యను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పరుచూరి శ్రీధర్,ఏ ఐ కే ఎమ్ ఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య, ఎచ్ ఆర్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఐ ఎఫ్ టి యూ జిల్లా ఉపాధ్యక్షులు నీలం సాయిబాబా, ప్రజాసంఘాల నాయకులు జేపీ గంగాధర్,భారతి, నర్సింగ్ రావు , భాస్కర్, సాయి కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కొండల్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి



ఉప్పల్( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మరియు ఉప్పల్ సర్కిల్లోని రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ల లో పార్టీ పరిస్థితి ప్రస్తుత పరిణామాలపై వివరంగా చర్చించిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తవిడబోయిన గిరిబాబు, గాయం శ్రీధర్ రెడ్డి ఈ సందర్భంగా కొండల్ రెడ్డి పార్టీకి కష్టకాలంలో వచ్చి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకు అధిష్టానమే సీట్లు ఇస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# కొండగట్టు ఆలయం అభివృద్ధికి 35.19 కోట్ల నిధులు కేటాయించడం హర్షణీయం : జె.దశరథ్



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలో కొండగట్టు శ్రీ ఆంజ నేయస్వామి ఆలయ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు రూ.35.19 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్ష ణీయమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 96 గదుల నిర్మాణం కోసం టీటీడీ నిధులు విడుదల చేయడం తో పాటు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేయడం అభినందనీయమని తెలిపారు. దీని వల్ల కొండ గట్టుకు వచ్చే భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, చంద్రబాబు నాయుడు పై ఆరోపణలు సరికావని హెచ్చరించారు. అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవ ల ఛార్జీలను పెంచి భక్తుల పై అదనపు భారం మోపుతోందని ఆరో పించారు.భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని దశరథ్ డిమాండ్ చేశారు.

# ప్రజలకు జబ్బులు రావాలి డాక్టర్లకు డబ్బులు కావాలి



- కార్పోరేట్ వైద్యం మానవత్వం మరచిన వైద్యులు
- వైద్యం సేవా వృత్తి నుంచి కార్పోరేట్ వ్యాపారంగా మారిందా.?
- లేని రోగాలను ప్రజలకు అంటగడుతున్న కార్పోరేట్ వైద్యులు
- లక్షలలో జీతాలు లేని రోగాలతో ప్రజల నుండి వసూళ్లు
- రోగం లేకుండా ఉన్నదంటూ తప్పుడు నిర్ధారణ పరీక్షలు
- ఆరోగ్య వంతులను అనారోగ్య వంతులుగా చేస్తున్న కొందరు నేటి వైద్యులు




**(ఆర్ కె ప్రశ్న న్యూస్ బ్యూరో)**

ఒకప్పుడు వైద్యుడు అంటే రోగికి ధైర్యం, కుటుంబానికి భరోసా.వైద్య వృత్తి మానవత్వానికి ప్రతీకగా నిలిచేది. డాక్టర్ మాటే మందుగా భావించే రోజులు అవి. రోగి పరిస్థితిని అర్థం చేసుకొని, తక్కువ ఖర్చుతో, నిజాయితీగా చికిత్స చేయడమే వైద్య ధర్మంగా కొనసాగింది.

### నేటి వైద్యం మారుతున్న ముఖచిత్రం

కాలక్రమంలో వైద్య రంగంలో సాంకేతికత పెరిగింది. అదే సమయంలో కార్పొరేట్ సంస్కృతి కూడా ప్రవేశించింది. ఫలితంగా వైద్యం సేవగా కాకుండా వ్యాపారంగా మారిందన్న విమర్శలు పెరుగుతున్నాయి. రోగి బాధలు కాకుండా లాభాల కేంద్రంగా వ్యవస్థ నడుస్తోందన్న భావన ప్రజల్లో బలపడుతోంది.

### హాస్పిటల్‌లో అడుగు పెట్టగానే టెస్టుల వరద

నేటి రోజుల్లో ఆసుపత్రికి వెళ్లిన రోగి ముందుగా ఎదుర్కొనేది పరీక్షల జాబితా.
చిన్న ఆరోగ్య సమస్యకే స్కాన్లు, ఖరీదైన టెస్టులు సూచించడం సాధారణమైంది. అవి నిజంగా అవసరమా.? లేక ఆదాయం కోసమేనా.? అన్న సందేహం రోగులను కలవరపెడుతోంది. చికిత్సకంటే ముందే బిల్లుల భయం మొదలవుతోంది. అవసరం లేని పరీక్షలు చేసి చివరికి ఏ వ్యాధి లేదని చెప్పడం ప్రస్తుతం డాక్టర్లకు ఆనవాయితీగా మారింది. కేవలం డబ్బు కోసమే డాక్టర్లు చాలావరకు అవసరంలేని పరీక్షలు చేయిస్తున్నారన్న విమర్శలు జోరుగా ఉన్నాయి.

### లేని రోగాలకు నిర్ధారణలు

ఇటీవలి కాలంలో వినిపిస్తున్న తీవ్రమైన ఆరోపణ లేని రోగాలకు నిర్ధారణ చేయడమే. పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికీ "ఇది మొదటి దశ", "ఇప్పుడు జాగ్రత్త పడకపోతే ప్రమాదం" అంటూ భయపెట్టే పరిస్థితులు ఉన్నాయి. ఈ మాటలు విని రోగి, అతని కుటుంబ సభ్యులు గందరగోళానికి గురవుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్ సరైన విధంగా రోగనిర్ధారణ పరీక్షలు చేయకపోవడం, రోగనిర్ధారణ పరీక్షలు చేసే సమయంలో టెక్నీషియన్స్ ఫోన్ లో మాట్లాడడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రోగుల రిపోర్టులు తారుమారు చేయడం, ఒక ల్యాబ్ లో పరీక్ష చేపిస్తే రోగము ఉన్నట్లు మరో లాభంలో అదే పరీక్ష చేపిస్తే రోగం లేనట్లు రిపోర్టులు రోగులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

### రోగి భయరాలాభాలకు మూలధనం

డాక్టర్లు రోగి భయాన్ని ఆసరాగా చేసుకొని ఖరీదైన చికిత్సలకు ఒప్పిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. "ఇప్పుడే చేయకపోతే ప్రమాదం" అనే మాటలు రోగిని మానసికంగా బలహీనుడిని చేస్తాయి. ఆ భయమే కార్పొరేట్ వైద్యానికి ప్రధాన ఆయుధంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోగిని వాళ్ళ కుటుంబ సభ్యులను భయానికి గురి చేయడం ఇప్పుడే అడ్మిట్ కాకపోతే మనిషి చనిపోయే ప్రమాదం ఉందని భయాందోళనకు గురి చేయడం కేవలం డబ్బు సంపాదన కోసమే డాక్టర్లు ఆసుపత్రులు ఇలా తెగ పడుతున్నాయి.

### లక్షల్లో జీతాలు.. ప్రజలపై భారాలు

కార్పొరేట్ హాస్పిటళ్లలో పనిచేసే కొంతమంది వైద్యులకు లక్షల్లో జీతాలు, విదేశీ పర్యటనలు, టార్గెట్లు ఉన్నాయన్న చర్చ బహిరంగమే. ఆ టార్గెట్లు నెరవేర్చే క్రమంలో అనవసర చికిత్సల భారం రోగులపై పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యవంతుడిని కూడా అనారోగ్యం అంటగట్టి రోగిగా మారుస్తున్న మూర్ఖులుగా కొంతమంది వైద్యులు మారడం పై ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. ఒక్క చికిత్సతోనే కుటుంబం ఆర్థికంగా కుంగిపోయే పరిస్థితులు అనేకం ఉన్నాయి. అయిన కొంతమంది వైద్యులలో కొంచెం మానవత్వం, కనికరం లేకుండా డబ్బు కోసం కర్కశంగా మారుతున్నారని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

### ఆరోగ్యానికి ముందు ఆర్థిక క్షీణత

అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తి బయటకు వచ్చేసరికి ఆరోగ్యం కంటే అప్పులే ఎక్కువగా మిగులుతున్నాయి. భూములు, బంగారం, ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సమాజ ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం. మంచి వైద్యులు ఇంకా ఉన్నారు అన్ని వైద్యులను ఒకే గూటికి కట్టలేం. ఇప్పటికీ మానవత్వంతో, నిజాయితీగా పనిచేసే చాలామంది వైద్యులు ఉన్నారు. తక్కువ ఖర్చుతో చికిత్స చేసే డాక్టర్లు సమాజానికి ఆశగా, ఆదర్శంగా నిలుస్తున్నారు. కానీ కార్పొరేట్ వ్యవస్థలో వారి స్వరం నెమ్మదిగా అణగదొక్కబడుతోంది.

### ప్రభుత్వ నియంత్రణ అవసరం

ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. కార్పొరేట్ హాస్పిటళ్లపై కఠిన పర్యవేక్షణ, అనవసర టెస్టులు–చికిత్సలపై స్పష్టమైన మార్గదర్శకాలు, రోగి హక్కులపై అవగాహన పెంచాల్సిన అవసరం ప్రభుత్వం పైననే ఉంది. వైద్య నైతికతను కాపాడే విధంగా చట్టాలు అమలవ్వాలి. ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులపై దృష్టి సారించి వాళ్ల దోపిడీని అరికట్టిన నాడే దేశంలో ప్రజలు హాయిగా ఆరోగ్యంగా జీవించ గలరన్న వాస్తవం ప్రభుత్వం అర్థం చేసుకొని ఆచరించాలి.

### వైద్యం మళ్లీ సేవగా మారాలి

వైద్యం వ్యాపారంగా మారితే సమాజమే అనారోగ్యానికి గురవుతుంది. రోగి నమ్మకమే వైద్యుని నిజమైన సంపద. ఆ నమ్మకం కోల్పోతే వైద్య వృత్తి తన విలువను కోల్పోతుంది. రోగికి వైద్యుడు అంటే నారాయణుడిగా కనిపించాలి కానీ యముడిలా కాదు. అందుకే వైద్యం మళ్లీ సేవగా మారాల్సిన అవసరం ఉంది. అదే సమాజ ఆరోగ్యానికి సరైన దారి. ఇప్పటికైనా మానవత్వం ఉన్న ప్రతి వైద్యుడు అతి తక్కువ ఖర్చుతో రోగాన్ని నయం చేసి రోగిని ఆరోగ్యవంతంగా చేయడానికి చూడాలి తప్ప డబ్బు ఇచ్చే ఏటీఎం మిషన్ ల చూడవద్దని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

# నీరుగార్చింది నువ్వే

## - సీఎం రేవంత్ పై హరీశ్ రావు విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నీరు గార్చింది రేవంత్ రెడ్డి మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. ఆయన తెలంగాణ భవన్ లో నీటి పారుదల అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరాన్ని కాలరాసిందని, పాలమూరును పండబెట్టిందని ఆరోపించారు.
కృష్ణా నది ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. పాలమూరు వలసలకు కారణం కాంగ్రెస్ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో కోటి ఎకరాలకు సాగు నీరందిందని తెలిపారు. అందువల్లనే తెలంగాణ వరి పండించడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుందని హరీశ్ రావు తెలిపారు.

### - బీఆర్ఎస్ హయాంలోనే..

బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రాజెక్టులను పూర్తి చేశామన్న హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి తమ పార్టీని బద్నాం చేస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకోవడమే కాని, పిడికెడు బువ్వ పెట్టిన పాపాన ఎన్నడూ పోలేదన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు అన్నీ అబద్ధాలే శాసనసభలో చెప్పాలన్నారు. నాడు తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ తో కలిపి మరణ శాసనం రాసింది కాంగ్రెస్ మాత్రమేననిహరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత నీటిపారుదల విషయంలోనూ, తాగు నీటి విషయంలోనూ సరైన చర్యలు తీసుకోవడం వల్లనే ఈనాడు భూముల విలువ కోట్ల రూపాయలకు పెరిగిందని గుర్తు చేశారు.

### - తెలంగాణను మోసం చేసింది కాంగ్రెస్

తెలంగాణ ఉద్యమాన్ని గత కొన్ని దశాబ్దాలుగా నీరు గార్చింది కాంగ్రెస్ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన తెలంగాణను వెనక్కు తీసుకుని వందలాది మంది యువకుల ప్రాణాలను బలితీసుకుంది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్ని లక్షల ఎకరాలకు సాగు నీరందిందో తెలుసా? అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.
అటువంటి కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీని, రైతులను, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడిన రేవంత్ రెడ్డి నాలుక కోయాలని హరీశ్ రావు అన్నారు. చీము నెత్తురున్నోడయితే.. మనిషైతే నేరుగా రాజీనామా చేయాలని హరీశ్ రావు అన్నారు. ఈ మాటలు అన్నందుకు తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తాడని, అయినా తనకు భయం లేదని అన్నారు.

# మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన

## - చర్చలతోనే పరిష్కారమని సూచన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వెనెజువెలాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా డెల్టా దళాలు శనివారం అరెస్ట్ చేశాయి. వెనెజువెలాలోని ఓ సైనిక స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని యుద్ధనౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించాయి. మదురోపై అమెరికా తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈ కేసులో మదురో భార్య, కుమారుడితో పాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు. మదురో అరెస్ట్ నేపథ్యంలో వెనెజువెలా సుప్రీంకోర్టు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. దేశ సమగ్రత, పరిపాలనా కొనసాగింపునకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.

### - వెనెజువెలా పరిణామాలపై భారత్ ఆందోళన

ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనెజువెలాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

# 'తేజస్' యుద్ధ విమానం తొలి గగన విహారానికి 25 ఏళ్లు

## - శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషిని కొనియాడుతూ ఐఏఎఫ్ ట్వీట్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ రంగ చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం. స్వదేశీ పరిజ్ఞానంతో, పూర్తి స్థాయి భారతీయ సాంకేతికతతో రూపొందిన తేజస్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్సీఏ) నింగికెగిసి నేటికి సరిగ్గా 25 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆదివారం ప్రత్యేక సందేశాన్ని విడుదల చేసింది. ఏడీఏ శాస్త్రవేత్తలు, హెచ్ఏఎల్ ఇంజనీర్లు, టెస్ట్ పైలట్ల కృషి వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని, ఆత్మనిర్భర్ భారత్ సాధనలో ఆకాశమే హద్దు అని ఐఏఎఫ్ కొనియాడింది. 2001 జనవరి 4న బెంగళూరులోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ (టీడీ–1)గా తేజస్ తన తొలి ప్రయాణాన్ని ప్రారంభించింది. వింగ్ కమాండర్ రాజీవ్ కొథియాల్ ఈ విమానాన్ని విజయవంతంగా నడిపి చరిత్ర సృష్టించారు. 1983లో పాత విమానాల స్థానంలో కొత్తవి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఎల్సీఏ ప్రాజెక్ట్.. నేడు అత్యాధునిక తేజస్ ఎంకే–1ఏ స్థాయికి ఎదిగింది. ఈ ప్రస్థానంలో తేజస్ ఎన్నో కీలక మైలురాళ్లను అధిగమించింది. 2025 చివర్లో రూ. 62,370 కోట్ల విలువైన మరో 97 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల తయారీకి హెచ్ఏఎల్ ఆర్డర్ దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే ఉన్న 83 జెట్ల ఆర్డర్లకు ఇది అదనం. ఇక ప్రైవేట్ రంగ భాగస్వామ్యంలో భాగంగా, హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ తయారు చేసిన సెంటర్ ఫ్యూజ్‌లేజ్ (విమాన మధ్య భాగం)ను 2025 మే నెలలో హెచ్ఏఎల్‌కు అప్పగించారు. సాంకేతికపరంగా కూడా తేజస్ తన సత్తా చాటుతోంది. 2025 మార్చిలో తేజస్ నుంచి స్వదేశీ అస్త్ర క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. అదే నెలలో పైలట్లకు ప్రాణవాయువు అందించే స్వదేశీ ఆక్సిజన్ సిస్టమ్ ను 50 వేల అడుగుల ఎత్తులో విజయవంతంగా పరీక్షించారు. పాతికేళ్ల ఈ ప్రయాణం భారత రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధం దిశగా నడిపిస్తోంది.

# మదురోకు పట్టిన గతే మీకు పడుతుంది

## - కొలంబియా అధ్యక్షుడికి ట్రంప్ వార్నింగ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అరెస్టు చేసి అమెరికాకు తరలించిన నేపథ్యంలో పొరుగునే ఉన్న కొలంబియాకు కూడా అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మాదకద్రవ్యాలను అమెరికాలోకి డంప్ చేసే వారు ఎవరైనా సరే వారికి ఇదే గతి పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి ట్రంప్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. 'మదురో తన దేశంలో కొకైన్ తయారుచేసి అమెరికాకు పంపించాడు. అమెరికన్లను మత్తులో ముంచేయ్యాలని చూశాడు. ఇప్పుడు మదురోకు పట్టిన గతి చూశారు కదా. మా దేశంలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు పంపించేవారికి ఇదే గతి పడుతుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. కొలంబియా కూడా మాదకద్రవ్యాలను తయారుచేసి అమెరికాలోకి డంప్ చేస్తోందని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో కొలంబియాలోని డ్రగ్స్ తయారీ లేబరేటరీలపై దాడులు చేసే అంశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు.

### వెనెజువెలాపై దాడిని ఖండించిన పెట్రో..

వెనెజువెలా రాజధాని కరాకస్ పై అమెరికా బలగాల దాడులను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఖండించారు. ఈ చర్య లాటిన్ అమెరికా సార్వభౌమాధికారంపై జరిగిన దాడేనని విమర్శించారు. ఇది హ్యూమానిటేరియన్ క్రైసిస్ కు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, యాంటీ డ్రగ్ స్ట్రాటజీలో భాగంగా అమెరికా ఇటీవల కరేబియన్ సముద్రంలో తన నౌకలను మోహరించిన విషయం తెలిసిందే. ఈ చర్యను విమర్శించిన పెట్రో కొలంబియాలోని డ్రగ్స్ తయారీ లేబరేటరీలపై దాడులు చేస్తామంటూ ట్రంప్ చేసిన పరోక్ష హెచ్చరికలను కూడా ఆక్షేపించారు. కొలంబియా భూభాగంపై దాడులు జరపడమంటే ఆక్రమణకిందే చూస్తామని పెట్రో స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588